**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

RNI : TELTEL/2021/80267

సంపుటి: 6 సంచిక: 71, పేజీలు - 08

మంగళవారం, సెప్టెంబర్ 8, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

# తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఎస్ఐఆర్ పేరుతో వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఏకంగా కోటి మంది ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన తర్వాత ప్రసంగించిన ముఖ్యమంత్రి.. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రస్తావిస్తూ కేంద్రం, బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. ఎస్ఐఆర్ పేరుతో రాష్ట్రంలోని వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని

2లో..



# కేంద్ర కేబినెట్లో తిరుగుబాటు..?

- రాజీనామాకు నిరాకరిస్తున్న ఏడుగురు మంత్రులు..?



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీలో విద్యార్థుల నిరసనల తర్వాత దేశంలో రాజకీయాలు వేగంగా మారుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అదే సమయంలో ఢిల్లీ నిరసనలకు ముందే కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ప్రయత్నాలు ప్రారంభించిన ప్రధాని మోడీ ఆ తర్వాత పార్లమెంట్ సమావేశాలపై దీని ప్రభావం పడుతుందని భావించి వెనక్కి తగ్గారు. ఆ తర్వాత కూడా కేబినెట్ ప్రక్షాళనకు వీలుగా ముందుగా బీజేపీ జాతీయ కార్యవర్గంలో మార్పులు చేశారు. రాజ్యసభ పదవీకాలం ముగిసిన కేంద్రమంత్రులకు పొడిగింపు కూడా ఇవ్వకుండా సాగనంపారు. అయినా కేబినెట్ ప్రక్షాళనపై ముందడుగు పడకపోవడం వెనుక కీలక కారణాలున్నట్లు తెలుస్తోంది. కేంద్ర కేబినెట్ ప్రక్షాళన కోసం ఇప్పటికే ప్రధాని మోడీ, అమిత్ షా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడం వెనుక మంత్రుల తిరుగుబాటే కారణంగా

2లో..

# చిత్తూరు తాగునీటి కష్టాలకు చెక్

- జలధార ప్రాజెక్టు పనులపై పవన్ దిశానిర్దేశం
- నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలని సూచన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో తాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తాగునీటి ప్రాజెక్టుల పనులపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. అత్యంత తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన తాగు నీటి ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లక్ష్యాలను నెలవారీ, వారాల వారీగా నిర్దేశించుకోవాలని పనులను వేగంగా పూర్తిచేసి, గడువులోగా ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

2లో..

# ఇది దుశ్శాసన సభ..

మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా..?

- నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక సీఎం రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ

2లో..



# ఎప్పుడు ఎన్నికలొచ్చినా కూటమిదే విజయం

- సర్వేలన్నీ మనకే అనుకూలం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు ఎన్నికలు జరిగినా మళ్లీ ఎన్డీయే కూటమిదే ఘనవిజయమని సీఎం నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. అన్ని తాజా సర్వేలు కూటమికే అనుకూలంగా ఉన్నాయంటూ తెలుగుదేశం పార్టీ నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. అమరావతి వేదికగా నిర్వహించిన టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలకు భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. పాలనలోనూ, రాజకీయాల్లోనూ కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య యునిటీ ముఖ్యమని, అంతర్గత వివాదాలు, చిన్న చిన్న గిల్లికజ్జాలతో రచ్చకెక్కవద్దని నేతలకు సూచించారు. రాజకీయ నాయకులు ఎప్పటికప్పుడు భవిష్యత్ పరిస్థితులను అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధికి అనేక

2లో..

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను ఎలా అడ్డుకుంటారు

- హోంశాఖకు హైకోర్టు నోటీసులు

- నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు
- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్న ఘటనపై హోంశాఖకు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రజాప్రతినిధులు ప్రవేశించకుండా పోలీసులు ఎలాంటి ఆంక్షలు విధించకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఎమ్మెల్యేలు సభా నిబంధనలను ఉల్లంఘిస్తే, వారిపై చర్యలు తీసుకునే పూర్తి అధికారం కేవలం స్పీకర్‌కే ఉంటుందని, ఈ విషయంలో

2లో..

# కేటీఆర్ తలకు గాయం - చిరిగిన హరీష్ షర్ట్

# అసెంబ్లీ వద్ద రణరంగం

- అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్-పోలీసుల మధ్య తోపులాట
- పలువురు నేతలు టీషర్టులు విప్పి నిరసన
- నేతలకు గాయాలైనట్లు బీఆర్ఎస్ ఆరోపణ
- కౌశిక్‌రెడ్డి సహా నేతలతో పోలీసుల వాగ్వాదం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** శాసనసభ సమావేశాల వేళ అసెంబ్లీ ప్రాంగణం వద్ద ఉదయం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంపై గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. పోలీసుల వ్యవహార శైలికి, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై జరిగిన భౌతిక దాడులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం, అప్రజాస్వామిక వైఖరిపై బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

### మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారు

అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన

2లో..

# అధికారుల నిర్లక్ష్యమే సత్య నికేతన్ భవన ప్రమాదానికి కారణం

- కేంద్రం, ఎంసీడీ, డీయూలకు హైకోర్టు నోటీసులు
- పీజీ నిబంధనలు, విద్యార్థుల డేటాపై ఆదేశాలు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధాని ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో ఐదంతస్తుల హాస్టల్ భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఘోర ప్రమాదంపై ఢిల్లీ హైకోర్టు అత్యంత తీవ్రంగా స్పందించింది. అనధికారిక నిర్మాణాలు, అధికారులు వహించిన నిర్లక్ష్యంపై న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సదరు ప్రమాదకర భవన నిర్మాణానికి, అనుమతులకు బాధ్యులైన ప్రభుత్వ అధికారులు గనుక తమ విధులను సక్రమంగా, బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఉంటే ఈ ఘోర విషాదం జరిగి ఉండేది కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రాణాంతక ఘటనలు పునరావృతం కాకుండా అరికట్టేందుకు తగిన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ), ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ), జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ)లకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సత్య నికేతన్ పీజీ భవనం కూలిపోయిన నేపథ్యంలో ఢిల్లీ నగరంలో వెలసిన అనధికార నిర్మాణాలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.

### పీజీల నిబంధనలు, విద్యార్థుల భద్రతపై ప్రశ్నల వర్షం!

ఢిల్లీ నగరంలో ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న పీజీ హాస్టళ్లలో విద్యార్థుల భద్రత, కనీస సౌకర్యాలపై ఢిల్లీ హైకోర్టు పలు కీలక ప్రశ్నలను లేవనెత్తింది. ఢిల్లీ పరిధిలో పీజీ హాస్టళ్ల ఏర్పాటు, అక్కడి వసతులకు

2లో..

# తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం

- ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి ఛైర్మన్ ను కోరిన వైనం
- స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య
- బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ

2లో..

ప్రజాప్రశ్న



# ఇది దుశ్శాసన సభ..

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. “ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో ‘స్మాష్ ది పాట్రియార్కీ’ అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు” అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

## తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర

రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని అన్నారు. పేదలు, కూలీలు, కార్మికులు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లిన పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారి ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని వ్యాఖ్యానించారు. తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే సుమారు 80 వేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. చనిపోయిన వ్యక్తుల పేర్లను తొలగించడమే కాకుండా ఒకే ప్రాంతంలో పుట్టి, అక్కడే నివసిస్తున్న వారి ఓట్లపైనా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.ఎన్నికల్లో ఎవరు గెలవాలనే అంశాన్ని ఓట్ల జాబితా మార్పుల ద్వారా ప్రభావితం చేసే ప్రయత్నం జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తమకు వ్యతిరేకంగా ఓట్లు పడే ప్రాంతాలను గుర్తించి బూత్‌ల వారీగా ఓట్లను తొలగిస్తున్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి ఓట్లను చేర్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందే ఓట్ల తొలగింపునకు సంబంధించిన కార్యాచరణ మొదలైందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. బిహార్, పశ్చిమ బెంగాల్‌లో అనుసరించిన విధానాలను తెలంగాణలోనూ అమలు చేస్తామని బీజేపీ నేతలు బహిరంగంగా చెబుతున్నారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. గతంలో ఎన్నికల్లో గెలిచేందుకు అక్రమ కేసులు, చట్టాలను ఉపయోగించేవారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చిన తర్వాత ఓట్ల తొలగింపును ఒక క్రమపద్ధతిలో చేపడుతున్నారని ఆయన విమర్శించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఆర్ఎస్ వైఖరిని కూడా రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఓట్ల తొలగింపు అంశంపై బీఆర్ఎస్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. రాష్ట్రంలోని ప్రజలు ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటు నమోదులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఓటు తొలగిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి ఓట్ల తొలగింపు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటే 2029లో మోదీ ఓటమికి ఇదే పునాది అవుతుందని వ్యాఖ్యానించారు. మోదీ దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని విమర్శించారు. మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అవుతుందని అన్నారు.

# కేంద్ర కేబినెట్లో తిరుగుబాటు.?

కాక్రోచ్ జనతా పార్టీ ఆరోపిస్తోంది. బీజేపీలోని పలువురు మంచి మనసున్న వ్యక్తులు పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈడీ, ఐటీ, సీబీఐల బెదిరింపుల కారణంగా పార్టీని వీడలేకపోతున్నారని తాము ఇదివరకే చెప్పినట్లు కాక్రోచ్ జనతా పార్టీ జాతీయ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ వెల్లడించారు. ఇప్పుడు వ్యవస్థలోని ఉన్నత స్థాయి మిత్రులు కేంద్ర మంత్రివర్గంలో బహిరంగ తిరుగుబాటు జరుగుతోందని తమకు చెబుతున్నారని సౌరవ్ దాస్ సంచలన ట్వీట్ చేశారు. ఏడుగురు మంత్రులు రాజీనామా చేయడానికి నిరాకరించినట్లు తెలుస్తోందని ఆయన వెల్లడించారు. తమకు నిష్కళంకమైన రికార్డు ఉన్నప్పటికీ, ఫిరాయింపుదారులకు చోటు కల్పించడం కోసం రాజీనామా చేయమని అడుగుతున్నారని వారు అంటున్నారన్నారు. అందుకే ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగడం లేదని చెబుతున్నారని సౌరవ్ తెలిపారు. ఆ తర్వాత జంతర్ మంతర్ నిరసన సాధించింది ఏమిటని తమను అడుగుతున్నారని బీజేపీ నేతల్ని ఎద్దేవా చేశారు.

## చిత్తూరు తాగునీటి కష్టాలకు చెక్

జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల కింద రూ. 2,370 కోట్లతో చేపట్టిన చిత్తూరు మల్టీ విలేజ్ స్కీమ్ పనుల పురోగతిపై పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం కోసం పొందాల్సిన అనుమతులు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.మరోవైపు రాష్ట్రంలో అత్యంత నీటి ఎద్దడి కలిగిన ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, 2024తో ముగిసిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 సంవత్సరం వరకు పొడిగించారు. జల్ జీవన్ మిషన్ 2.0 కింద దాదాపు రూ. 26,000 కోట్ల విలువ చేసే తాగునీటి ప్రాజెక్టుల పనులు చేపడుతున్నారు. మొదటి విడతగా రూ. 7,910 కోట్లతో ఐదు జిల్లాల పరిధిలో ఐదు మెగా వాటర్ గ్రిడ్ పథకాలు చేపట్టారు. అందులో చిత్తూరు కూడా ఒకటని అధికారులు వివరించారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు తాగునీటి భద్రత కల్పించేందుకు రూ. 2,370 కోట్ల అంచనా వ్యయంతో తాగునీటి సరఫరా పనులు చేపట్టారు.గండికోట, వెలిగల్లు జలాశయాలను నీటి వనరులుగా ఉపయోగిస్తూ అమలవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో ఉన్న 18 మండలాలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించనున్నారు. దీని ద్వారా సుమారు 25 లక్షల మంది ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పనున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి గండికోట వద్ద ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నీటి సంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు పనులు వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం

జరిగిన అవమానమని అన్నారు.బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు.

తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు.మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను ఎలా అడ్డుకుంటారు

పోలీసులకు జోక్యం చేసుకునే హక్కు లేదని వ్యాఖ్యానించింది. అసెంబ్లీ వ్యవహారాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారాలే అత్యంత కీలకమైనవని స్పష్టం చేస్తూ, ఎమ్మెల్యేల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.అలాగే, ఈ ఘటన సమయంలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడిన పోలీసులను వెంటనే గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.

మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన దాడిని అత్యంత తీవ్రమైన అంశంగా పరిగణించిన కోర్టు, ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన పూర్తి నివేదికను సమర్పించాలని డీజీపీని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ధర్మాసనం 2 వారాల పాటు వాయిదా వేసింది.

# ఎప్పుడు ఎన్నికలొచ్చినా కూటమిదే విజయం

అవకాశాలు ఉన్నాయని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు వాటిని సరిగ్గా అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిస్థాయి నివేదికను తయారుచేస్తామన్నారు. విశాఖపట్నం రీజియన్‌కు పెద్ద ఎత్తున పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, ఇవి రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే ఏపీలో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తే దాదాపుగా మెజారిటీ సమస్యలు తీరతాయి కనుక నేతలంతా ఈ అంశంపై ఫోకస్ చేయాలని దిశానిర్దేశం చేశారు.

### విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. “విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం” అని తెలిపారు.
కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. “వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు” అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

### 28 జిల్లాలకు ఇంఛార్జ్‌ల లిస్ట్ ప్రకటన

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాలకు ఇంఛార్జ్‌లను నియమించారు. ఈసారి అభ్యర్థుల ఎంపికను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలకు అప్పగించారు. ఎన్నికల ప్రచారం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను యాక్టివ్ చేయడంతో పాటు కూటమి మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఇంఛార్జ్‌లకు సూచించారు. 1. పార్వతీపురం మన్యం: దాడి రత్నాకర్, 2. అల్లూరి సీతారామరాజు: పేరాబత్తుల రాజశేఖర్, 3. శ్రీకాకుళం: ఎండీ నజీర్, 4. విజయనగరం: ఎంపీ చింతకాయల విజయ్, 5. విశాఖపట్నం: ఎంఏ షరీఫ్, 6. అనకాపల్లి: కొండపల్లి అప్పలనాయుడు, 7. పోలవరం: కే సత్తిబాబు, 8. కాకినాడ: సుజయ కృష్ణారంగారావు, 9. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ: ఎంపీ సానా సతీశ్, 10. తూర్పు గోదావరి: దేవినేని ఉమామహేశ్వరరావు, 11. పశ్చిమ గోదావరి: ఎంపీ భాష్యం రామకృష్ణ, 12. ఏలూరు: ఎమ్మెల్సీ పంచమర్తి అనురాధ, 13. కృష్ణా: కొమ్మాలపాటి శ్రీధర్, 14. ఎన్టీఆర్: మల్లికార్జునరావు, 15. గుంటూరు: ఎంపీ సత్యనారాయణరాజు, 16. పల్నాడు: కొనకళ్ల నారాయణ, 17. బాపట్ల: జంగా కృష్ణమూర్తి, 18. ప్రకాశం: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, 19. మార్కాపురం: ఎమ్మెల్సీ బీటీ నాయుడు, 20. నెల్లూరు: ఎస్పీఎస్ఎన్ వర్మ, 21. తిరుపతి: నూకసాని బాలాజీ, 22. చిత్తూరు: దామచర్ల సత్య, 23. కడప: దీపక్ రెడ్డి, 24. అన్నమయ్య: ఎమ్మెల్సీ శ్రీకాంత్, 25. అనంతపురం: ఏరాసు ప్రతాపరెడ్డి, 26. శ్రీసత్యసాయి: సోమిశెట్టి వెంకటేశ్వర్లు, 27. కర్నూలు: పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, 28. నంద్యాల: వైకుంఠం ప్రభాకర్ చౌదరి.

## అధికారుల నిర్లక్ష్యమే సత్య నికేతన్ భవన ప్రమాదానికి కారణం

సంబంధించి ఏవైనా నిర్దిష్ట నిబంధనలు లేదా మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయా? అనే అంశంపై పూర్తి వివరణాత్మక స్పందనను నివేదిక రూపంలో సమర్పించాలని మున్సిపల్ కార్పొరేషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. మరోవైపు ఢిల్లీ విశ్వవిద్యాలయం కూడా ఈ విచారణ పరిధిలోకి వచ్చింది. తమ విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ కళాశాలల్లో చేరిన ఇతర ప్రాంతాల విద్యార్థుల సంఖ్య ఎంత? యూనివర్సిటీకి అనుబంధంగా నడుస్తున్న కళాశాలలు స్వయంగా నిర్వహిస్తున్న అధికారిక హాస్టళ్ల సంఖ్య ఎంత? అనే వివరాలకు సంబంధించిన పూర్తి డేటాను అందించాలని డీయూ యాజమాన్యాన్ని న్యాయస్థానం స్పష్టంగా కోరింది.

### పరారీలో ఉన్న పీజీ యజమాని రాజస్థాన్‌లో అరెస్ట్

ఈ భవన ప్రమాదం జరిగిన వెంటనే పరారైన పీజీ భవన యజమాని హరిరామ్ గుప్తాపై ఢిల్లీ పోలీసులు గతంలో లుకౌట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే పోలీసు బృందాలు తీవ్రంగా గాలించి అతడినిరాజస్థాన్‌లో అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఈ ఘోర ప్రమాదానికి కారణమైన వ్యక్తులు, నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతపై న్యాయస్థానంతో పాటు విచారణ వ్యవస్థలు కూడా దృష్టి సారించాయి.

## కేటీఆర్ తలకు గాయం - చిరిగిన హరీష్ షర్ట్

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు.మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు.మరోవైపు తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు సైతం ఆందోళన బాట పట్టారు. 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. భూ దందాలపై విచారణ జరిపించాలని పట్టుబట్టారు. నిరసనలకు దిగారు. వారి నిరసనతో స్పీకర్ సభను కొంంత సమయం పాటు వాయిదా వేయాల్సి వచ్చింది.

## ఆత్మకూరు మున్సిపాలిటీ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చేయడమే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ధ్యేయం

**- సింగిల్ విండో చైర్మన్ ఎ.షహబుద్దీన్**





**ఆత్మకూరు** ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడం వలన ఆత్మకూరు పట్టణంలోని, ప్రజలు ఇబ్బంది పడకూడదు అని శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ ఎస్.బేబీ ఆధ్వర్యంలో సింగిల్ విండో చైర్మన్ ఏ.షహబుద్దీన్ వివిధ వార్డులలో నూతన బోర్లకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ ఏ.షహబుద్దీన్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన ఆత్మకూరు మున్సిపాలిటీ నందు నీటి ఎద్దడి రాకుండా ముందుచూపుగా శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు కొన్ని ప్రాంతాల్లో బోర్లు వేయించి, పట్టణ ప్రజలు ఇబ్బంది పడకుండా చూడడమే తమ ధ్యేయంగా పనిచేస్తున్నారని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత కార్యవర్గ సభ్యులు వెన్న శ్రీధర్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ ఆన్సర్ అలీ, ఆయా వార్డు అధ్యక్షులు అమ్ముల్లా, ఖాజాముద్దీన్, న్యామతుల్లా టిడిపి నాయకులు జలీల్,రాఘవాచారి ,మహబూబ్, శ్రీను, షఫీ, మున్సిపల్ ఏఈ షాహిద్, సిబ్బంది జీవన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 27న పింక్ పవర్ రన్ 3.0

ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈనెల 27న పింక్ పవర్ రన్ 3.0 ను నిర్వహిస్తున్నట్లు సుధా రెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ సుధా రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ లోని ఓ హోటల్ లో రన్ కు సంబంధించిన జెర్సీ, మెడల్స్ ను మిస్ వరల్డ్ 2025 ఓపల్ సుచత, ప్రముఖ క్యాన్సర్ చికిత్స నిపుణురాలు ప్రజ్ఞ చిగురుపాటి నాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధా రెడ్డి మాట్లాడుతూ తాను లండన్ లో ఉన్న సమయంలో అక్కడి స్థానికులు ఆరోగ్యంపై వహిస్తున్న శ్రద్ధను గమనించి ఇక్కడి ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఆరోగ్య సంరక్షణ పై అవగాహన కల్పించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఈమెయిల్ ఫౌండేషన్ తో కలిసి పింక్ పవర్ రన్స్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ హెల్త్ పార్టనర్ గా ఏఐజి సంస్థ భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. 20వేల మందికి పైగా రన్ లో పాల్గొనే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 75 లక్షలకు పైగా ప్రైస్ మనీ గా అందిస్తామని తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్ పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్యాన్సర్ బారిన పడ్డ కుటుంబాలకు తమ ఫౌండేషన్ అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. ఆనందమయ జీవితం సంపూర్ణ ఆరోగ్యంతోనే సాధ్యమని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో నడక వ్యాయామం భాగం చేసుకోవాలని సూచించారు.

# పింఛన్లు దరఖాస్తు తేది సెప్టెంబర్ 30 వరకు పొడిగించాలి



**చిట్వేలి :** ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు అన్ని రకాల పించన్దార్లకు కొత్త పించన్లు మంజూరు కోసం దరఖాస్తు పెట్టుకొనేందుకు సెప్టెంబర్ 16 తేది వరకు మాత్రమే అవకాశం ఇచ్చిందని, 30వ తేదీ వరకు గడువు పొడిగించాలని ఏపీ వికలాంగులు, పించన్దార్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.యన్. ఆంధ్రయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. చిట్వేలి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కులం, ఆదాయ ధ్రువీకరణ, ఇతర సర్టిఫికెట్ లు స్వర్ణ గ్రామ వార్డు సచివాలయం లో పొందాలంటే 10 రోజులు నుండి 15 రోజులు సమయం పడుతుందని పించన్దార్లు దరఖాస్తు పెట్టుకొనే తేది సెప్టెంబర్ 30 వ తేది వరకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. అర్హులైన కొత్త దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం 2025 నుండి హాస్పిటల్ కీ వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని వచ్చినా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయం ద్వారా ఇంతవరకు మెడికల్ సర్టిఫికెట్ లు ఇవ్వలేదన్నారు. అర్హులైన దివ్యాంగులకు స్వర్ణ గ్రామ, వార్డు అధికార్లు ద్వారా పరిశీలన చేసి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. వికలాంగులు నివసించుటకు సొంత ఇండ్లు లేక అనేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు పంచాయతీ ప్రాంతంలో 3 సెంట్లు ఇంటి స్థలము, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా ఇండ్లు మంజూరు చేయాలన్నారు. నిరుపేద దివ్యాంగులకు ప్రభుత్వం నుండి సబ్సిడీ లోన్లు మంజూరు చేయాలని, నిరుద్యోగ దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మహిళా చైర్మన్ కె. నాగమణి, యం. సుబ్బారాయుడు, ఆర్. నరసింహ రాజు, కె. పెద్దయ్య నాయుడు, జె. విశ్వనాథ్, డి. శంకర్ రెడ్డి, రత్నమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

## శ్రీ సీతారామాలయ ప్రారంభోత్సవంలో

# రామిరెడ్డి ధ్వజారెడ్డి



**చిట్వేలి** చిట్వేలి మండలంలోని నగరిపాడు ఉప్పరపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, మండల అధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ నిర్మాణం అనంతరం శ్రీ సీతారాముల విగ్రహాలను కొనుగోలు చేసి సమకూర్చిన రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, శ్రీ సీతారాముల వారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందుకు ఆలయాల అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. నూతన ఆలయ నిర్మాణంతో గ్రామంలో భక్తుల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగం లక్ష్మీకర్, లింగం పద్మాకర్ గ్రామస్థులు, భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో టాస్క్ ఫోర్స్‌కు

# బంగారు పతకాలు

**- మూడు గోల్డ్, రెండు సిల్వర్, ఆరు బ్రాంజ్ పతకాలు**

**- పతకాలు సాధించిన టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్లను అభినందించిన ఎస్పీ**



**విజయవాడ** విజయవాడలో జరిగిన మొదటి ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ లో పతకాలు సాధించిన ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) పోలీసులను టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ సోమవారం అభినందించారు. రెండు రోజుల క్రితం జరిగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో టాస్క్ ఫోర్స్ పోలీసులు కు పతకాల పంట పండింది. వాటర్ స్పోర్ట్స్ కాయాకింగ్ విభాగంలో ఎం. హాజువలి కి రెండు గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలను సాధించారు ఇంకా ఏ. విద్యాసాగర్ కు ఒక గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలు సాధించారు. వారిని అభినందించిన ఎస్పీ పీ శ్రీనివాస్ మాట్లాడుతూ వారు చేపట్టిన కృషితోనే పతకాలు సాధించుకున్నారని, టాస్క్ ఫోర్స్ కు పేరు తీసుకుని వచ్చారని తెలిపారు. ఇలాంటి పతకాలు భవిష్యత్తు లో మరిన్ని సాధించాలని ప్రోత్సహించారు. వారిని అభి అభినందించిన వారిలో ఏఎస్పీ జె. కులశేఖర్, డీస్పీలు ఎండీ షరీఫ్, వీ శ్రీనివాసరెడ్డి, బీ. సాయి గిరిధర్, ఏసీఎఫ్. జె.శ్రీనివాస్ ఉన్నారు. క్రీడాకారులను సత్కరించి అభినందనలు వ్యక్తం చేశారు.

# దళిత స్పీకర్‌ను అవమానిస్తారా.?

**- అసెంబ్లీ సాక్షిగా వీధి రౌడీల్లా ప్రవర్తిస్తారా.?**

**- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మైనారిటీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సమీర్**

**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభాపతి పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేయడం, మరోవైపు బీఆర్ఎస్ నేతలు రామారావు, కౌశిక్‌రెడ్డి తదితరులు వీధి రౌడీల మాదిరిగా ప్రవర్తిస్తూ పోలీసులపై దాడికి ప్రయత్నించడం దురదృష్టకరమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మైనారిటీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సమీర్ విమర్శించారు. అసెంబ్లీ వంటి గౌరవప్రదమైన వేదికను బీఆర్ఎస్ నేతలు కౌరవసభగా మార్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.దళితులంటే బీఆర్ఎస్ పార్టీకి గిట్టదని వారు ఆరోపించారు. గతంలో జరిగిన నేరెళ్ల, మరియమ్మ ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం సభాపతి పదవిలో ఉన్న దళిత నాయకుడిని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి సభ్యత్వాలను రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.బకాయిలు మీ హయాంలో.. బురద మాపై ఎందుకు?గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని వారు విమర్శించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించకుండా, ఇప్పుడు విద్యార్థులపై కపట ప్రేమ చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.(బీఆర్ఎస్ పాలనలో భారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోలేదా.? అని వారు ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా




దక్కదని, ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందని సర్దార్ ఖాన్, మహమ్మద్ సమీర్ ఘాటుగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ వహీద్, మాజీ ఉపసర్పంచ్ జహీర్, సీనియర్ నాయకులు గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, జంగం రమేష్, ఊడెం శ్రీనివాస్ రెడ్డి, కుంట్ల లక్ష్మారెడ్డి, తంజీముల్ మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతిన్, జాంగిర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఆజార్, శివారెడ్డి, మున్నా, సమీర్, అజీముద్దీన్, చెప్పాల శేఖర్, హాసన్, భాస్కర్, శ్రావణ్, మహమ్మద్ షకీల్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జాలిగామ గ్రామ సమస్యలు పరిష్కరించాలి

**- ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి**




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** జాలిగామ గ్రామంలో ఆగిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పునఃప్రారంభించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరచాలని వారు కోరారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఇతర సమస్యలను కూడా ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నవాజ్, మీరా బెండే మధు, బయ్యారం మాజీ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, చిట్యాల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# పేదల పట్ట భూములను నిషేధిత జాబితాలో చేర్చవద్దు

**- రాజ్య సభ ఎం పి ఆర్ కృష్ణయ్య - ప్రభుత్వ నిషేధిత భూములలో అపార్ట్మెంట్లు, ఫామ్ హౌస్ లు, ప్లాట్లు చేస్తే 22 ఏ లో పెట్టాలి**




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)**రాష్ట్రంలో 22ఏ పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు చెందిన పట్టా భూములను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర అన్యాయం చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరాలు, పట్టణాల్లో మున్సిపల్ పర్మిషన్లు, హెచ్ఎండీఏ, హుడా అనుమతులు పొంది, ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని, క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్, నీటి బిల్లులు చెల్లిస్తున్న భూములను కూడా హఠాత్తుగా 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చడం అన్యాయమన్నారు. ప్రభుత్వం కావాలనే ఉద్దేశపూర్వకంగా భూ సమస్యలను సృష్టిస్తోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తన సొంత బలం లేదా కాంగ్రెస్ పార్టీ బలంతో మాత్రమే గెలవలేదని, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు వీధుల్లో ప్రచారం చేసి కాంగ్రెస్‌కు అధికారం అందించారని అన్నారు. ఆ అధికారాన్ని సొంత బలంగా భావించి నిరంకుశ పాలన సాగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. శ్రీలంక, నేపాల్, అమెరికా వంటి దేశాల్లో యువత తిరగబడినట్లే తెలంగాణలోనూ పాలకులపై యువత తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూములు, ఎండోమెంట్స్, వక్ఫ్ భూములను మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచాలని, అయితే పేదల పట్టా భూములను కావాలనే 22ఏలో చేర్చి, అనంతరం వారిని భయభ్రాంతులకు గురిచేసి తక్కువ ధరలకు భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించాలనే ఉద్దేశంతో రెవెన్యూ, పోలీసు అధికారులను తమ చేతుల్లో పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.

రాజ్యాంగం ప్రకారం ఎంఆర్‌వోలు, కలెక్టర్లు, డీఎస్పీలు, సీఐల బదిలీలు, పోస్టింగులు చీఫ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ పరిధిలోని అంశాలని, కానీ ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు చెప్పిన వారికే పోస్టింగులు ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో అధికారులు ప్రజలకు కాకుండా ఎమ్మెల్యేలకు గులాంగిరి చేసే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. అధికారులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. భూమి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే 22ఏ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీ




వేదికగా ప్రతిపక్షాలు పోరాడాలని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులంతా తమ సమస్యలను ప్రజా సంఘాల దృష్టికి తీసుకురావాలని, నాయకుల మెడలు వంచైనా బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. తెహల్కా మీడియా నెట్వర్క్ ఎడిటర్ కే. చంద్ర శేఖర్ ఆధ్వర్యములో జరిగిన ఈ సమావేశానికి సౌత్ ఇండియన్ జర్నలిస్ట్ ఫోరం ఫౌండర్ ప్రెసిడెంట్ సి. శ్యామ్ కుమార్ అధ్యక్షత వహించారు. తెలంగాణ విఠల్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ, సోమ శేఖర్, నారగొని ప్రవీణ్, నాగరగోని ప్రవీణ్, రంగినేని శ్రీనివాసరావు, సురేష్ పొద్దార్, ముఖ్య అతిథి ఆర్, కృష్ణయ్య, ఎంపీ బాలకృష్ణ ఏ1 టీవీ చైర్మన్, ఎర్రబెల్లి సతీష్, బి. నర్సింగరావు, కుమార్ యాదవ్, ఉగ్గే శ్రీను, ఎం. విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్




సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని, ఉన్నత స్థానాలకు చేరాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు మొత్తం 150 మంచాలు, బెడ్స్ ఇవ్వగా, సిరిసిల్లలోని కేజీబీవీ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ప్రారంభించారు. వసతులు, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తదితర అంశాలపై విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని విద్యాలయాల్లో వసతులు, భోజనం పరిశీలించేందుకు టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు.ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ వాడవద్దని, పెద్దలను గౌరవించాలని సూచించారు. విలువలు ఉన్న విద్యార్థిగా ఎదగాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక ప్రకారం చదవాలని, తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏదైనా ఉద్యోగం, స్వయం ఉపాధిలో స్థిరపడాలని పేర్కొన్నారు. సమాజానికి కూడా తిరిగి ఇవ్వాలని, సేవ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, జీ సీడీఓ పద్మజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ కే రాజీవ్ కుమార్, బ్యాంక్ చీఫ్ మేనేజర్ వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల భారీ ధర్నా

**- ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడంతో నిరసన**



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ ధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు నడుమ తీవ్ర నెట్టివేత, తోపులాట జరగడంతో వాతావరణం వేడెక్కింది. ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు రోడ్డుపై ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేశారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డుపైకి చేరి ధర్నాకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికమంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.?ధర్నా అనంతరం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయానికి తరలివెళ్లి తమ వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.?ఈ క్రమంలో నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. పరిస్థితి చేయి దాటడంతో కేడీసీసీ చైర్మన్ కృష్ణారెడ్డి, తిమ్మాపూర్ సర్పంచ్ అందే సుభాష్‌లతో పాటు పలువురు ముఖ్య నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల రౌడీయిజం నశించాలంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు చేసిన నినాదాలతో ఎల్లారెడ్డిపేట ప్రాంతమంతా మార్మోగింది.నాయకుల అరెస్ట్‌తో ఎల్లారెడ్డిపేటలో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉంది. ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అంగరంగ వైభవంగా గంగ తెప్పోత్సవం వేడుకలు

## త్వరలోనే రాష్ట్ర పండుగగా గంగపుత్రుల గంగ తెప్పోత్సవం

**- ప్రభుత్వమే అధికారికంగా జరిపేందుకు ఏర్పాట్లు**

**- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో గంగపుత్రులకు సాంస్కృతిక న్యాయం**

**- ట్యాంక్ బండ్ సమీపంలో ఏటా ఘనంగా ఉత్సవాలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే గంగపుత్రుల గంగ తెప్పోత్సవం రాష్ట్ర పండుగగా ఆమోదముద్ర వేయనుంది. ఈ మేరకు జీఓ సైతం విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ గంగ తెప్పోత్సవం కమిటీ ఆధ్వర్యంలో గత 9 ఏళ్లుగా గంగ తెప్పోత్సవం హైదరాబాద్ నడిబొడ్డున అత్యంత వైభవంగా , శోభాయమానంగా నిర్వహిస్తున్నారు. కమిటీ అధ్యక్షుడు మహేందర్ బాబు బెస్త , ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ బెస్త ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వైభవోపేతంగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మరోవైపు పెద్దపల్లి జిల్లా మంథనిలోని బెస్తపల్లిలో సమీప గ్రామాలైన చందనాపూర్, సుందిల్ల, అన్నారం, ముస్త్యాల , దుబ్బపల్లి, సిరిపురం, రామగిరి, కామన్ పూర్ తదితర గ్రామాల ప్రజలను భాగస్వామ్యం చేసి అఖిల భారత గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గంగ తెప్పోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతృత్వంలో 33 జిల్లాల్లోని చెరువులు, కుంటలు, వాగులు , వంకలు ఉన్న చోట , మత్స్య సొసైటీలు ఉన్న ప్రదేశంలో గంగపుత్రులు గంగ తెప్పోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే గంగ తెప్పోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. త్వరలోనే ప్రభుత్వం ప్రకటనతో 5 లక్షల గంగపుత్రులు ప్రభుత్వానికి తమ కృతజ్ఞత తెలియజేయనున్నట్లు ఆయా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న ఈ మహా పండుగకు ఇప్పటికే పలు రాష్ట్ర సంఘాలు తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం, తెలంగాణ గంగపుత్ర సంఘం, గంగపుత్ర చైతన్య సమితి, రివర్ సైడ్ గంగపుత్ర యువ సంఘంతో పాటు గంగపుత్ర అభివృద్ధి సంఘం , ఏక సంఘం జేఏసీ సహా జాతీయ సంఘం అఖిల భారత గంగపుత్ర మహాసభ కూడా ఈ పండుగకు మద్దతు ప్రకటించాయి. అలాగే గంగా తెప్పోత్సవం ఘన విజయవంతం నేపథ్యంలో రాష్ట్ర పండుగ గుర్తింపు కోసం కృషి చేస్తున్నట్లు ఇప్పటికే స్పష్టం చేశాయి. ఇకపై తమ కులంలో ఎన్ని సంఘాలు ఉన్నా తాము అందరము ఒక్కటే అని , ప్రభుత్వం నుంచి తమకు రావాల్సినవి సాధించుకుంటామని జాతీయ, రాష్ట్ర స్థాయి సంఘాలు ధీమా వ్యక్తం చేశాయి.



### తెలంగాణ గంగ తెప్పోత్సవం 2026 - జలసిరికి హారతి

గంగపుత్రుల సంస్కృతీ వైభవానికి ప్రతీకగా 'గంగ తెప్పోత్సవ' మహా శోభాయాత్ర. గంగపుత్రుల సాంస్కృతిక అస్తిత్వానికి, అచంచల భక్తిప్రపత్తులకు నిలువుటద్దంగా నిలిచే గంగ తెప్పోత్సవ సంబరాలు ఈ ఏడాది మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వైభవోపేతంగా, కనులపండువగా జరిగాయి. తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ పర్యవేక్షణలో సాగిన ఈ అద్భుత శోభాయాత్ర ఖైరతాబాద్‌లోని ప్రసిద్ధ మెట్రో స్టేషన్ (ఏడు గుళ్ల) ప్రాంగణం నుండి మంగళధ్వనుల మధ్య అట్టహాసంగా మొదలైంది. అక్కడి నుండి చారిత్రక రైల్వే గేటు, ఆధ్యాత్మికత ఉట్టిపడే గ్రంథాలయ (బడా గణేష్) జంక్షన్, ఐమ్యాక్స్ థియేటర్ మీదుగా సాగుతూ అశేష భక్తజనవాహిని నెక్లెస్ రోటరీ మీదుగా ఉత్సవం కొనసాగింది.జీవనదాత అయిన హుస్సేన్ సాగర్ తీరాన కొలువై ఉన్న గంగమ్మ తల్లి ఆలయ సన్నిధిలో భక్తులు శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించి, కనులవిందుగా గంగాదేవి ఆశీర్వాదం చినుకులు కురుస్తున్న వేల భక్తి శ్రద్ధలతో గంగతెప్పను జలరాశిలోకి ప్రవేశపెట్టారు. ఈ మహోజ్వల యాత్ర పొడవునా, రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన గంగపుత్రుల ఉత్సాహం మధ్య సాంప్రదాయ బోనాలు, భక్తి పారవశ్యాన్ని పంచే జోగినీ బోనాలు, అద్భుతంగా అలంకరించిన చేపల వలల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటికి తోడు వగ్గుడోలు శివతాండవ ధ్వనులు, పోతురాజుల వీర విన్యాసాలు, వైవిధ్యభరితమైన జానపద సాంస్కృతిక బృందాల నృత్యాలు ఈ శోభాయాత్రను ఒక అద్భుత దృశ్యకావ్యంగా ఆవిష్కరించాయి.దారిపొడవునా నగరవాసులు, ప్రయాణికులు ఈ సంస్కృతీ వైభవాన్ని తిలకిస్తూ మైమరచిపోయారు. ఈ ఉత్సవాల ముగింపు పర్వంగా, మహోన్నతమైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఛాయలో ఉన్న హెచ్ఎండీ మైదానంలో ఒక భారీ బహిరంగ సభ కొలువుదీరింది. ప్రముఖ రాజకీయ ప్రముఖులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , బీజేవైఎం నేషనల్ లీడర్ పీఎం సాయి ప్రసాద్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , ఎమ్మెల్యేలు దానం నాగేందర్ , నవీన్ యాదవ్ , ఫిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి సహా సినీ రంగానికి చెందిన సుప్రసిద్ధ కళాకారులు, మత్స్య శాఖకు చెందిన విశిష్ట ప్రతినిధుల సమక్షంలో ఈ సభ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగడం విశేషం.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**

**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 105 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రశ్న



# సభకు రాని అధినేత..

## సభను అడ్డుకునే బీఆర్ఎస్

- చర్చకు దూరం.. గందరగోళానికే బీఆర్ఎస్ ప్రాధాన్యం
- దళిత స్పీకర్‌పై దూషణలు..
- బీఆర్ఎస్ దొరతనంపై మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఫైర్
- అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ సభ్యుల తీరుపై వజ్రేష్ యాదవ్ ఆగ్రహం



**బోడుప్పల్ (ప్రశ్న న్యూస్)** సభకు రాని మీ అధినేతకు ప్రతిపక్ష హోదా ఎందుకు..?ప్రజా సమస్యలపై చర్చించే దమ్ము లేకే సభను అడ్డుకుంటున్నారని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చేపట్టిన నిరసన, ఆందోళన తీరుపై ఆయన మండిపడ్డారు.ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ముతో ప్రతి నెలా వేతనాలు పొందుతూ, ప్రతిపక్ష నాయకుడి హోదాను అనుభవిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని వజ్రెష్ యాదవ్ విమర్శించారు.ప్రజా సమస్యలపై సభలో చర్చించాల్సిన బాధ్యతను విస్మరించి, బయట ఆందోళనలతో రాజకీయ ప్రయోజనం పొందాలని చూడటం సమంజసం కాదన్నారు.మీ అధినేత సభకు రారు..మీరు సభను సజావుగా జరగనివ్వరు.ప్రజల సమస్యలపై చర్చించాలనే చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వం ఎదుట ప్రశ్నలు సంధించాలి. కానీ ప్రజాస్వామ్య వేదికను అడ్డుకోవడమే లక్ష్యంగా వ్యవహరించడం బీఆర్ఎస్ వైఖరికి నిదర్శనం”అని ఆయన పేర్కొన్నారు.అసెంబ్లీ వద్ద నిరసన పేరిట బీఆర్ఎస్ సభ్యులు చేసిన హడావుడి ప్రజాప్రతినిధులకు తగదని వజ్రెష్ యాదవ్ అన్నారు.అసెంబ్లీ వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులతో ఘర్షణకు దిగడం,మహిళా పోలీసుల ముందే అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శించారు.బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధులు సంయమనం పాటించి ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అభిప్రాయాలను వెల్లడించాల్సి ఉండగా, వీధి రౌడీల మాదిరిగా వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన వారే నిబంధనలను ఉల్లంఘించేలా ప్రవర్తించడం ప్రజలకు తప్పుడు సందేశం ఇస్తోందన్నారు.దళిత స్పీకర్‌పై వ్యాఖ్యలు ఖండనీయంస్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు ఉపయోగించిన పరుష పదజాలాన్ని వజ్రెష్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.దళిత వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా బీఆర్ఎస్ నాయకులు తమ దొరతనపు ధోరణిని మరోసారి బయటపెట్టుకున్నారని ఆరోపించారు.స్పీకర్ పదవికి రాజ్యాంగబద్ధమైన గౌరవం ఉందని,సభ నిర్వహణ బాధ్యతలు చేపట్టే వ్యక్తిపై వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.రాజకీయ భేదాభిప్రాయాలు ఉండవచ్చని,కానీ రాజ్యాంగ పదవుల పట్ల గౌరవం తప్పనిసరిగా ఉండాలని సూచించారు.ప్రజల సమస్యలను చర్చించేందుకు అసెంబ్లీ అనే వేదిక ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ సభ్యులు చర్చను పక్కనపెట్టి గందరగోళానికి ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమని వజ్రెష్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే సభలో పాల్గొని నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి

# కృషి చేయాలి

- వజ్రేష్ యాదవ్‌ను కలిసిన ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఎర్ర విజయ్‌రావు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను మేడ్చల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఎర్ర విజయ్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.అనంతరం మేడ్చల్ ప్రాంతంలోని ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎర్ర విజయ్‌రావు వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి సమస్యలు, ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.ఆటో కార్మికుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సమస్యలకు పరిష్కారం చూపించి న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎర్ర విజయ్‌రావు కోరారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతుందని ఆయన తెలిపారు.

## నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా భారీ ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చిన అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని మండల కేంద్రాలలో అవగాహన ర్యాలీలు, అక్షర యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలి అని మేడ్చల్ మల్కాజిగిరి అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవభారత సాక్షరతా కార్యక్రమం జరుగుతున్నదని, ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాక, ఒక సామాజిక బాధ్యత అని అన్నారు.ప్రతి అక్షరాస్యుడు ఒక ఉపాధ్యాయుడిగా మారాలని సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ అక్షర యజ్ఞంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒకరికి లేదా ఇద్దరికి చదువు నేర్పించి, వారిని అక్షరాస్యులను చేయడం ద్వారా జిల్లాను సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా తీర్చిదిద్దాలి”లి అని కోరారు.

### ఎస్ హెచ్ జి మహిళల సాధికారతే లక్ష్యం

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలందరూ ఉల్లాస్ ద్వారా అక్షరాస్యతతో పాటు, డిజిటల్, ఆర్థిక, జీవన నైపుణ్యాలను నేర్చుకొని తమ నిత్య జీవితంలో ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో జీవిస్తూ తమ కుటుంబ జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాలలో ఎం ఈ ఓ లు, , వాలంటీర్ టీచర్లు, ఎస్ హెచ్ జి మహిళలు, ప్రజాప్రతినిధులు, అభ్యసనదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో

# స్పష్టమైన వేళలు పాటించాలి

- 12 గంటల విద్యుత్ సరఫరా తప్పనిసరిగా అందించాలి
- సీపీఐ నేత బట్టు దయానందరెడ్డి



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** జగదేవపూర్ : మండలంలో వ్యవసాయానికి అందిస్తున్న త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అధికారులు స్పష్టమైన వేళలను పాటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు, సీపీఐ సీనియర్ నాయకుడు బట్టు దయానందరెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు రోజుల వరకు సంబంధిత విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉండేదన్నారు. అయితే గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా వేళల్లో ఎలాంటి నిర్దిష్టత లేకుండా మార్పులు చేస్తున్నారని తెలిపారు.ఒకరోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మరో రోజు ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, ఇంకో రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ప్రతిరోజూ సుమారు రెండు గంటల మేర త్రీఫేస్ విద్యుత్ సరఫరా తగ్గిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రకటించిన కనీసం 12 గంటల విద్యుత్ సరఫరా కూడా రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆరోపించారు. రైతులు గందరగోళానికి గురికాకుండా ప్రతిరోజూ ఒకే సమయం నుంచి ఒకే సమయం వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 12 గంటల విద్యుత్ సరఫరాను తగ్గించకూడదని విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు.విద్యుత్ సరఫరాలో ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేక భావన మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఉద్యమాలకు సిద్ధమయ్యే పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి నిర్ణీత సమయపాలనతో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలని బట్టు దయానందరెడ్డి కోరారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి

# పేదల పాలిట వరం లాంటిది

- కాంగ్రెస్ సీనియర్ నేత సాయి పేట శ్రీనివాస్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిదినుండి మంజూరైన చెక్కులను 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్, డివిజన్ ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంద భానుచందర్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మంది పేదలకు వరంలాగా మారిందని వారన్నారు, ప్రతి పేదవాడికి కొండంత అండగా మరియు ఆసరాగా నిలిచే ఈ యొక్క ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రతి ఒక్కరు ఆపదలో ఉన్నప్పుడు వినియోగించుకోవాలని కూడా వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడు పేద మధ్యతరగతి ప్రజల వైపే ఉండాలని కూడా వారి సందర్భంగా గుర్తు చేశారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం లో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కూడా వారు తెలిపారు, ప్రతి ఒక్కరికి పేదింటి కలను నిజం చేసే విధంగా ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తున్నామని అన్నారు, ఈ క్రమంలో సంపత్ గౌడ్, కావలి భాస్కర్, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఉదయ్ గౌడ్, అనిల్ ముదిరాజ్, సోను, షబ్బీర్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాత మధును సస్పెండ్ చేయాలి

- కాంగ్రెస్ సీనియర్ నేత - గరిసెల సురేందర్ ముదిరాజ్



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును సస్పెండ్ చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.దళిత స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ అధికార ప్రతినిధి గరిసెల సురేందర్ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు.సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని సురేందర్ ముదిరాజ్ అన్నారు.ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అవమానాలు, కుల వివక్షకు తావులేదన్నారు.ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఘటనపై స్పందించి, ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను ఖండించడంతో పాటు దళిత సమాజానికి, స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సురేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.

## నేత్ర పరీక్షల శిబిరానికి విశేష స్పందన



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడిఒసి, కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన నేత్ర పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డా. బరీరా ఫరీద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సి. మోక్షిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ, నేత్ర ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం, నేత్రదానంపై చైతన్యం పెంపొందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.శిబిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ జిల్లా అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. నేత్ర ఆరోగ్యం, కంటి సంరక్షణపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డా. సి. చంద్రకళ, అధికారులు, సిబ్బంది తో కలిసి నేత్రదానం చేయడానికి ప్రతిజ్ఞ చేయించారు. నేత్రదానం ప్రాముఖ్యతను వివరిస్తూ, మరణానంతరం తమ నేత్రాలను దానం చేయడం ద్వారా అంధులకు చూపును అందించవచ్చని తెలియజేశారు. ఇదేవిధంగా జిల్లా రెవిన్యూ అధికారి .మాలతి, జిల్లా రూరల్ డెవలప్మెంట్ అధికారి సాంబశివ రావు. డా కౌశిక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సైతం ఉత్సాహంగా పాల్గొని నేత్ర పరీక్షలు చేయించుకున్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే

- రాజకీయ హైడ్రామాలు ఆపి గజ్వేల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొట్టాల యాదగిరి



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గత వారం రోజులుగా గజ్వేల్ నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కొనసాగుతున్న రాజకీయ పరిణామాలను చూస్తుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొట్టాల యాదగిరి విమర్శించారు.ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పక్కనపెట్టి అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ ధర్నాలు, నిరసనల పేరుతో రాజకీయ రచ్చ చేయడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని అన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా, ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యలపై బాధ్యతగా స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గజ్వేల్ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి తదితర అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారంపై చర్చించకుండా రాజకీయ ఆధిపత్యం కోసం పరస్పరం విమర్శలు చేసుకోవడం సరికాదన్నారు.ప్రజలకు కావాల్సింది రాజకీయ హైడ్రామాలు కాదు.. అభివృద్ధి.ప్రజలకు కావాల్సింది ఆరోపణలు కాదు.. పరిష్కారాలు.ప్రజలకు కావాల్సింది రాజకీయ పోరాటాలు కాదు.. ప్రజా సంక్షేమం.అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇకనైనా రాజకీయ డ్రామాలకు స్వస్తి పలికి గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని కొట్టాల యాదగిరి డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని కోరారు.“గజ్వేల్ ప్రజల తరపున మా ప్రశ్న ఒక్కటే.. రాజకీయాలు మీవి కావచ్చు.. కానీ గజ్వేల్ ప్రజల భవిష్యత్తు మాత్రం అందరిదీ. ఆ భవిష్యత్తు కోసం ఇకనైనా రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాలి” అని కొట్టాల యాదగిరి అన్నారు.

## ప్రజాధనం ఖర్చు చేస్తూ..

# ప్రజలకు దూరంగా ఉంటున్న కేసీఆర్

- ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ



**మేడ్చల్( ప్రశ్నన్యూస్ )** ప్రజాధనంతో జీతభత్యాలు, భద్రత, ఇతర ప్రభుత్వ వసతులు పొందుతూ ప్రజలకు, శాసనసభకు దూరంగా ఉంటున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ డిమాండ్ చేశారు.తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను శాసనసభలో ప్రస్తావించి, ప్రజల గొంతుకగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్ష నేత బాధ్యతను కేసీఆర్ విస్మరించారని విమర్శించారు. శాసనసభకు హాజరుకాకుండా, ప్రజా సమస్యలపై చర్చించకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైతే ప్రతిపక్ష నేత హోదా వల్ల ప్రజలకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు.

### ప్రజాధనంపై బాధ్యత ఉండాలి

ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌కు జీతభత్యాలు, భద్రత, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఇతర ప్రభుత్వ వసతుల కోసం భారీగా ప్రజాధనం ఖర్చవుతోందని మహేష్ కురుమ పేర్కొన్నారు. ప్రజల పన్నుల రూపంలో సమకూరే నిధులను వినియోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం సరికాదన్నారు.

### బీఆర్ఎస్ పాలనపై విమర్శలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా జరిగిందని మహేష్ కురుమ ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉందని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడంలో కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు.

### కాంగ్రెస్ ప్రజాపాలనతో అభివృద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని మహేష్ కురుమ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు దూరంగా ఉండే నాయకత్వం ప్రజలకు అవసరం లేదని మహేష్ కురుమ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులపై మేడ్చల్ లో రాస్తారోకో, రోడ్డుపై నిరసనలు, స్తంభించిన ట్రాఫిక్

- ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలింపు




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మేడ్చల్ లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మేడ్చల్ సీఐ అంజిరెడ్డి బి ఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగామాజీ గ్రంథాలయ చైర్మన్, బిఆర్ఎస్ సీనియర్ నేత భాస్కర్ యాదవ్ మాట్లాడుతూప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీకి వెళ్తున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే ప్రజాప్రతినిధులకు తమ విధులను నిర్వర్తించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.పోలీసుల చర్యలను పూర్తిగా ఖండిస్తున్నామని భాస్కర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపుతున్న మెదక్ జిల్లా రైతాంగం

**- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్: జిల్లాలోని రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారనీ జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ అన్నారు. సోమవారం కొల్చారం మండలంలోని తుక్కపూర్ గ్రామాలలో దుర్గ రాణి వ్యవసాయ భూమి తో పాటు వివిధ మండలలో ఈరోజు 29 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేశారని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ..ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉండటంతో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోందనీ,ఆయిల్‌పామ్ పంటకు నీటి వసతి ఉన్న భూములు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు.జిల్లా లక్ష్యం 2500 ఎకరాల్లో పంట నమోదు కోసం ఉద్యానవన శాఖ అధికారులు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.పంట సాగు విధానం, మొక్కల ఎంపిక, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ, అంతర పంటల సాగు తదితర అంశాలపై రైతులకు శిక్షణ, సాంకేతిక సూచనలు అందిస్తున్నారనీ పేర్కొన్నారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా ఆదాయం పొందే అవకాశం ఉండటంతో రైతులు ఈ పంటపై ఆసక్తి కనబరుస్తున్నారనీ, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, నాణ్యమైన మొక్కల సరఫరా, సాగు సాంకేతికతపై మార్గదర్శకత్వం వంటి సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారి సూచిస్తున్నారు.జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించేందుకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమ సమీప వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసచారి తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఉప సర్పంచ్ ఆరే రవీందర్, మాజీ సర్పంచ్ శ్రీశైలం ,సంబంధిత శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో పద్మ దేవేందర్‌రెడ్డి..

**- అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు.. ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి మండల నాయకులతో కలిసి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొని ప్రజల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు.ప్రధానంగా రైతులు సంతోషంగా ఉండాలని, రైతులు పండించే పంటలకు అనుకూల వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములైన గ్రామ ప్రజలకు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకరంపేట ఆర్ మండల అధ్యక్షులు పట్లోరి.రాజు,పట్టణ ఏమా చంద్రం.సర్పంచ్ కంజర్ల చంద్ర శేఖర్,మాజీ ఎంపీటీసీ వెంకటేశం,వార్డు సభ్యులు ఆలూరి రవి, నాయకులు మల్ల నారాయణ, సిరిగద్దె దినకర్, , ఆకుల దుర్గయ్య, షేకులు, బాలమల్లు, కిషన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# గంగపుత్ర మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

**- టిజిఎస్ రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ గంగపుత్ర వర్కింగ్ ఉమెన్స్ అసోసియేషన్ రాష్ట అధ్యక్షురాలిగా నియమితులైన దేశబోయిన రమాదేవి గంగపుత్రకు తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట వ్యాప్తంగా ఉన్న గంగపుత్ర వర్కింగ్ ఉమెన్స్‌ను సమన్వయం చేసుకుంటూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని నిరుపేద గంగపుత్ర మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతతో పాటు విద్య ఉపాధి రంగాల్లో వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.విద్యలో ప్రత్యేక ప్రతిభ కనబరుస్తున్న గంగపుత్ర విద్యార్థినులను ప్రోత్సహిస్తూ వారి ఉన్నత విద్యకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు అలాగే వర్కింగ్ ఉమెన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని రాష్ట ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు.రమాదేవి గంగపుత్ర నాయకత్వంలో తెలంగాణ గంగపుత్ర వర్కింగ్ ఉమెన్స్ అసోసియేషన్ మరింత బలోపేతమై, మహిళల సంక్షేమం మరియు అభ్యున్నతికి సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ‘నా నియోజకవర్గం.. నా విజన్.. నా యాక్షన్ ప్లాన్’

**- కోవూరును 2047 నాటికి రూ.1.75 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం**

**- టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**అమరావతి(ప్రశ్న న్యూస్)** స్వర్ణాంధ్ర--2047 విజన్‌ను రాష్ట్రస్థాయికే పరిమితం చేయకుండా ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి ఫలితాలు కనిపించేలా ఎమ్మెల్యేలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ప్రతి నియోజకవర్గాన్ని ఓ చిన్న రాష్ట్రంగా భావించి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన టీడీపీ ప్రజాప్రతినిధుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఆమె మాట్లాడారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను సంపన్న, ఆరోగ్యవంతమైన, సంతోషకర రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళ్తున్నారని చెప్పారు. ఆయన రాష్ట్రాన్ని ఆర్కిటెక్ట్‌లా చూస్తున్నట్టే ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధిని సమగ్ర దృష్టితో చూడాలన్నారు. కేవలం అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించడంతో సరిపోదని, నియోజకవర్గాన్ని ఇతరులకు ఆదర్శంగా నిలిపేలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు.

### డేటాతో అభివృద్ధి ప్రణాళిక

గ్రామం, మండలం, నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్లుగా తీసుకుని అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రశాంతి రెడ్డి సూచించారు. ఎక్కడ వ్యవసాయం, ఉద్యాన పంటలకు అవకాశాలున్నాయి.. ఎక్కడ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెంచవచ్చు.. ఎక్కడ విద్య, వైద్యం, తాగునీరు, రహదారుల వంటి మౌలిక వసతులు అవసరమో గుర్తించాలని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలను డేటా ఆధారంగా గుర్తించి, వాటి అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలన్నారు.నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు అందించే సమాచారం, నివేదికల ఆధారంగా ప్రతి నెలా శాఖల వారీగా అభివృద్ధి పనులను సమీక్షించాలని సూచించారు. ఎమ్మెల్యే కోఆర్డినేటర్, మానిటర్, ప్రాబ్లమ్ సాల్వర్‌గా వ్యవహరించాలని అన్నారు. సమావేశాల సంఖ్య కాదని.. వాటి ద్వారా ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే కొలమానమని స్పష్టం చేశారు.

### కోవూరుకు భారీ ఆర్థిక లక్ష్యం

ప్రస్తుతం కోవూరు నియోజకవర్గ ఆర్థిక వ్యవస్థ సుమారు రూ.8 వేల కోట్లుగా ఉందని, అందులో వ్యవసాయ రంగం వాటా సుమారు రూ.3 వేల కోట్లు ఉందని తెలిపారు. 2029 నాటికి కోవూరును సుమారు రూ.66 వేల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. దీర్ఘకాలంలో 2047 నాటికి కోవూరు ఆర్థిక వ్యవస్థను రూ.1.75 లక్షల కోట్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

### సాగు నుంచి సమగ్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ

కోవూరులో వ్యవసాయాన్ని కేవలం సాగు రంగంగా కాకుండా పూర్తి స్థాయి ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కోల్డ్ స్టోరేజీలు, గోదాములు, డ్రై ప్లాట్‌ఫామ్స్, పంటల వైవిధ్యీకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. పంటలను ముడి ఉత్పత్తులుగా విక్రయించకుండా సేకరణ, గ్రేడింగ్, నిల్వ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను స్థానికంగా అభివృద్ధి చేస్తే రైతుల ఆదాయంతోపాటు నియోజకవర్గ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందని తెలిపారు.

### ‘పీ4’తో సామర్థ్య నిర్మాణం

పీ4 కార్యక్రమం దానం చేయడం కాదని.. వ్యక్తుల్లో సామర్థ్యాన్ని పెంచడమే దాని లక్ష్యమని ప్రశాంతి రెడ్డి అన్నారు. ప్రతిభ ఉన్నవారికి సరైన సమయంలో అవకాశం, సహకారం, మార్గనిర్దేశం అందిస్తే వారు ఎదిగి మరొకరికి మార్గదర్శకులుగా నిలుస్తారని చెప్పారు.

‘నా నియోజకవర్గం.. నా విజన్.. నా యాక్షన్ ప్లాన్.. నా బాధ్యత’ అనే ఆలోచనతో ప్రతి ఎమ్మెల్యే పనిచేయాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాలు కాగితాలపై కాకుండా ప్రతి నియోజకవర్గంలో ప్రజలకు కనిపించే అభివృద్ధి ఫలితాలుగా మారాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై

# బీఆర్ఎస్ సమరభేరి

**- బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



**బోడుప్పల్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ, ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శైలజకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు,13 డిక్లరేషన్లు,420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నారు.కేవలం 100 రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు,వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు.

### బీఆర్ఎస్ ముఖ్య డిమాండ్లు..

మహాలక్ష్మి పథకం: మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం,తులం బంగారం,స్కూటీలను తక్షణమే పంపిణీ చేయాలి.ఆడబిడ్డలకు పూర్తి రక్షణ కల్పించాలి.

### రైతాంగానికి భరోసా..

ప్రతి పంటకు రైతు భరోసా,బోనస్ అందించాలి.కొరత లేకుండా ఎరువులు పంపిణీ చేయడంతో పాటు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి.రైతు కూలీలకు ఏడాదికి రూ. 12,000 సాయం అందించాలి.

### నిరుద్యోగులు, విద్యార్థులు..

అర్హులైన యువతకు జాబ్ క్యాలెండర్, ఉద్యోగాలు,నిరుద్యోగ భృతి చెల్లించాలి. విద్యార్థులకు విద్యా భరోసా పథకాన్ని వర్తింపజేసి,పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.సంక్షేమ పథకాలు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు,బీడీ కార్మికులకు పెంచిన పింఛన్ రూ.4,000 తక్షణమే అమలు చేయాలి.ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 అందించాలి. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు స్థలాలు ఇవ్వాలి. పారిశుధ్యం,పాలన: పట్టణాలు,గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసిందని, వెంటనే చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు.హామీలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని హెచ్చరించారు.ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్,కొల్తూరి మహేష్,లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, కౌడే పోచయ్య, మధుసూదన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు,శ్యామల శ్రీనివాస్, యుబిఏ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ, బుల్లెట్ శంకర్,జిలాని పాషా,కిరణ్ నాయక్, అమర్ పటేల్, చిరంజీవి,ప్రవీణ్ తదితరులు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 6 గ్యారంటీలు,420 హామీల

# పేరుతో కాంగ్రెస్ నియంత పాలన

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులకు నిరసనగా ధర్నా
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కుతున్న కాంగ్రెస్
- అసెంబ్లీ సమావేశాలను 30 రోజులు నిర్వహించాలి
- 6 గ్యారంటీలు,420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజావాణిలో ఫిర్యాదులు
- మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన ధర్నా



**బోడుప్పల్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ గత వారం రోజులుగా బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.ఈ అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు సిద్ధమై ప్రజా గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తారని భయంతో రేవంత్ రెడ్డి సర్కార్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టులు చేసి నిర్బంధాలకు గురిచేస్తుందని,ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా మాజీ జెడ్పిటిసి,బోడుప్పల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నిరసన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ 6 గ్యారంటీలు,420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్,ఇప్పుడు హామీల అమలును గాలికొదిలేసిందని కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రశ్నిస్తారని భయంతో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అక్రమంగా నిర్బంధించి,వేధిస్తున్నారని ఇది కాంగ్రెస్ నియంత పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.తక్షణమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను నిలిపివేసి అసెంబ్లీ సమావేశాలను 30 రోజులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి,ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్,కాటపల్లి రాంచంద్రారెడ్డి,బందారపు శ్రీధర్‌గౌడ్,తాల్క శత్రజ్ఞ,బొడగల్ల సదానంద్,కృష్ణగౌడ్,యువజన నాయకులు ఉప్పరి విజయ్,మైసగల్ల శ్రీకాంత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రా చెరువు వద్ద బేబీపాండ్ పనులను పరిశీలించిన

**- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్**



బోడుప్పల్ (ప్రశ్న న్యూస్)బోడుప్పల్ రా చెరువు ముందు ఏర్పాటు చేస్తున్న బేబీపాండ్ వద్ద బతుకమ్మ,గణేష్ నిమజ్జనాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పరిశీలించారు. పర్యావరణహితంగాగణేష్ నిమజ్జనాలను నిర్వహించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నగరవ్యాప్తంగా పలు కృత్రిమ బేబీపాండ్లు, పోర్టబుల్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తోంది.ఇందులో భాగంగా రా చెరువు ముందు ఏర్పాటు చేస్తున్న బేబీపాండ్ పనుల పురోగతిని అజయ్ యాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం,లైటింగ్,భద్రత,తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులను కోరారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి,బతుకమ్మ మరియు గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బొమ్మక కళ్యాణ్ కుమార్,కాంగ్రెస్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి,ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## నాని 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?

# సెప్టెంబర్ 24పై అనుమానాలు!




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది. ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

అయితే, ఈ వాయిదా వార్తలపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతానికి సెప్టెంబర్ 24నే అధికారిక విడుదల తేదీగా ఉంది. త్వరలోనే నాని చిత్రబృందంతో సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## విజయ్ సేతుపతి, సాయిపల్లవి

# లుక్ అదిరింది

## - టైటిల్ ఏంటో తెలుసా..?



తెలుగు, తమిళ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటారు విజయ్ సేతుపతి, సాయి పల్లవి. ఈ ఇద్దరూ రొమాంటిక్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారని తెలిసిందే. థగ్ లైఫ్ డిజాస్టర్ తర్వాత లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. కాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. ఈ మూవీకి అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు.దక్షిణాసియా నెట్‌వర్క్‌లో చేరండి లీడ్ పెయిర్‌పై డిజైన్ చేసిన మోషన్ పోస్టర్‌ను కూడా లాంచ్ చేశారు. ఈ చిత్రాన్ని 2027 జనవరిలో విడుదల చేయనున్నట్టు కూడా ప్రకటించారు. ఇప్పటికే ఈ మూవీ డిజిటల్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్, ఇండియా టాకీస్ బ్యానర్లతో కలిసి మద్రాస్ టాకీస్ తెరకెక్కిస్తోంది. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. విజయ్ సేతుపతి ఇప్పటికే మణిరత్నంతో ఓ సినిమా చేశాడని తెలిసిందే. అయితే సాయి పల్లవి కెరీర్‌లో మణిరత్నంతో కలిసి చేస్తున్న తొలి సినిమా ఇదే. మరి బ్యాక్ టు బ్యాక్ ఫ్లాపుల మధ్య ఉన్న మణిరత్నంకు ఈ రొమాంటిక్ డ్రామా ఎలాంటి కమ్ బ్యాక్ ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# భారత బాక్సాఫీస్ వద్ద 'స్పైడర్ మ్యాన్' కొత్త చరిత్ర



హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' భారత బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశీయంగా రూ. 500 కోట్ల వసూళ్లు సాధించిన తొలి హాలీవుడ్ చిత్రంగా ఈ సినిమా అరుదైన రికార్డును నెలకొల్పింది. ఇప్పటివరకు ఏ హాలీవుడ్ సినిమా కూడా ఈ మైలురాయిని అధిగమించలేకపోవడంతో, ఈ చారిత్రాత్మక విజయం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) నిర్మాణంలో, టామ్ హాలండ్ స్పైడర్ మ్యాన్‌గా నటించిన ఈ చిత్రం 2026 జూలై 30న భారీ అంచనాల మధ్య విడుదలైంది. ఊహించిన విధంగానే మొదటి వారం నుంచే వసూళ్ల ప్రభంజనం సృష్టించింది. కేవలం తొలి వారంలోనే రూ. 330 కోట్లకు పైగా వసూలు చేసిన ఈ సినిమా, విడుదలైన 39 రోజుల్లోనే రూ. 500 కోట్ల మార్కును అందుకుంది. భారత్ మార్కెట్?లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని సాధించింది. హాలీవుడ్ ట్రేడ్ విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఇప్పటివరకు ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 22,600 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టింది. గతంలో భారత్‌లో మార్వెల్, అవతార్ సిరీస్‌లతో పాటు క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో వచ్చిన పలు హాలీవుడ్ చిత్రాలు భారీ వసూళ్లను సాధించినప్పటికీ, ఏ చిత్రం కూడా రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరలేకపోయింది. తాజాగా స్పైడర్ మ్యాన్ ఆ రికార్డులను బద్దలు కొట్టి సరికొత్త శిఖరాలను అధిరోహించింది.

# స్టీవ్ జాబ్స్ స్ఫూర్తితో సినిమా..

## - రూ.2 కోట్లతో తీస్తే రూ.122 కోట్లు..
## - 'హనుమాన్ అంశ్' నిర్మాత వెనుక ఆసక్తికర కథ!



సాధారణంగా సినిమాల్లోకి రావడానికి ఒక్కొక్కరికీ ఒక్కో స్ఫూర్తి ఉంటుంది. కానీ, కేవలం 21 ఏళ్ల వయసులో ఒక యువతి, అదీ విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తూ, యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ గురించి తెలుసుకుంటూ నిర్మాతగా మారడం నిజంగా ఆశ్చర్యపరిచే విషయం. బాలీవుడ్‌లో ఇటీవల సంచలన విజయం సాధించిన 'హనుమాన్ అంశ్' చిత్ర నిర్మాత అనుప్రియ నగర్ విజయగాథ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. తాను ఊహించని విధంగా చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టడానికి స్టీవ్ జాబ్స్‌పై చేసిన పరిశోధనే కారణమని ఆమె తెలిపారు.యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ బాత్‌లో ఎకనామిక్స్ చదివిన అనుప్రియ, గ్రాడ్యుయేషన్ తర్వాత స్విట్జర్లాండ్‌లో ఆర్ట్ ఇండస్ట్రీలో ఉద్యోగం చేయాలని ప్రణాళిక వేసుకున్నారు. తన చివరి సంవత్సరంలో టెక్నాలజీ కంపెనీల వ్యవస్థాపకులపై పరిశోధన చేస్తున్నప్పుడు, స్టీవ్ జాబ్స్‌కు నీమ్ కరోలీ బాబాతో ఉన్న ఆధ్యాత్మిక అనుబంధం, ఆయన కైంచి ధామ్ సందర్శన గురించి చదివారు. "ఒక భారతీయ సాధువు గురించి నేను ఒక విదేశీయుడి ద్వారా తెలుసుకోవడం ఏంటి? అనే ఆలోచన నన్ను ఆశ్చర్యపరిచింది. ఆ క్షణమే నాలో మరింత ఆసక్తిని రేకెత్తించింది. బాబా గురించి లోతుగా పరిశోధించడం మొదలుపెట్టాను" అని అనుప్రియ పలు ఇంటర్వ్యూలలో వివరించారు.అకడమిక్ ఆసక్తిగా మొదలైన ఈ ప్రయాణం, ఆమెను నీమ్ కరోలీ బాబా జీవితంలోకి మరింత లోతుగా తీసుకెళ్లింది. చదువు పూర్తయ్యాక భారత్‌కు తిరిగి వచ్చిన ఆమె, అప్పటికే ఈ కథపై సినిమా తీయాలని ప్రయత్నిస్తున్న దర్శకుడు విశాల్ చతుర్వేదిని కలిశారు. ఈ కలయిక పూర్తిగా అనుకోకుండా జరిగిందని అనుప్రియ చెప్పారు. యూకేలో చదువుకునే రోజుల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసి తను సంపాదించుకున్న డబ్బును ఈ సినిమా ప్రాజెక్టులో పెట్టుబడిగా పెట్టడం విశేషం.నీమ్ కరోలీ బాబా (అసలు పేరు లక్ష్మీ నారాయణ్) బాల్యం ఆధారంగా తెరకెక్కిన బయోగ్రాఫికల్ డ్రామా 'హనుమాన్ అంశ్'. కేవలం రూ. 2 కోట్ల లోపు బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం, విడుదలైనప్పుడు సాధారణ స్పందనతో మొదలైంది. కానీ, చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన పాజిటివ్ మౌత్ టాక్‌తో అనూహ్యంగా పుంజుకుంది. కేవలం 31 రోజుల్లోనే ఇండియాలో రూ. 122 కోట్లకు పైగా నెట్ వసూళ్లను సాధించి బాక్సాఫీస్ వద్ద పెను సంచలనంగా నిలిచింది.

కళాఖండాలను

సేకరించే కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన అనుప్రియ, మొదట్లో తన కెరీర్ మార్పు గురించి కుటుంబ సభ్యులు ఆశ్చర్యపోయినా, సినిమా సాధించిన అద్భుత విజయం తర్వాత వారు గర్వపడ్డారని తెలిపారు. ఈ చిత్రాన్ని వ్యాపార దృక్పథంతో తీయలేదని, నీమ్ కరోలీ బాబా కథలను, ఆయన బోధనలను నేటి యువతరానికి చేరవేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. దర్శకుడు విశాల్ చతుర్వేది రాసిన ఆధ్యాత్మిక జ్ఞాపకాల ఆధారంగా ఈ చిత్రాన్ని మూడు భాగాలుగా తీయాలని యోచిస్తుండగా, 'హనుమాన్ అంశ్' అందులో మొదటి భాగం.

# రకుల్ ప్రీత్ సింగ్ రీ-ఎంట్రీకి రెడీనా ..

## ఏడాదిన్నర తర్వాత మళ్లీ జిమ్‌లోకి, అసలు కారణం ఇదే!



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్‌కు ఎప్పుడు బ్రేక్ వస్తుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్లుగా వెలిగిన వారు.. ఆ తర్వాత ఒక్కసారిగా సినిమాలకు దూరమై ప్రేక్షకులకు కనిపించకుండా పోతుంటారు. ప్రస్తుతం యంగ్ హీరోయిన్ల హవా కొనసాగుతుండటంతో పలువురు సీనియర్ హీరోయిన్లకు అవకాశాలు తగ్గుతున్నాయి. కొందరు పెళ్లి చేసుకుని కుటుంబ జీవితంలో స్థిరపడుతుండగా.. మరికొందరు బిజినెస్, ఇతర రంగాలపై ఫోకస్ పెడుతున్నారు. ఇదే సమయంలో ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది. సినిమాలకు కొంతకాలంగా దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. దాదాపు ఏడాదిన్నర తర్వాత మళ్లీ స్టైంత్ ట్రైనింగ్ వర్కౌట్స్ ప్రారంభించారు. జిమ్‌లో కష్టపడుతున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో.. రకుల్ మళ్లీ సినిమాల్లోకి రాబోతున్నారా? అనే చర్చ మొదలైంది.రకుల్ ప్రీత్ సింగ్‌కు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. 2009లో కన్నడ చిత్రం 'గిల్లి'తో హీరోయిన్‌గా సినీ ప్రయాణం ప్రారంభించారు. ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'కెరటం' సినిమాతో పరిచయమైన రకుల్.. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' తో మంచి విజయాన్ని అందుకుని ఒక్కసారిగా టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారారు. అనంతరం పలువురు స్టార్ హీరోల సరసన నటించి వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు.దక్షిణాసియా నెట్‌వర్క్‌లో చేరండి తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకున్న రకుల్.. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్.. ప్రస్తుతం హిందీ చిత్రాలపై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత జీవితంలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.తాను ప్రేమించిన బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీని రకుల్ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.అయితే కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంతో అభిమానులు రకుల్ కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే గతంలో తీవ్రమైన నడుము నొప్పి కారణంగా ఆమె కొంతకాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. దీంతో వర్కౌట్స్‌కు కూడా దూరంగా ఉన్నారు.తాజాగా దాదాపు ఏడాదిన్నర విరామం తర్వాత మళ్లీ స్ట్రెంత్ ట్రైనింగ్ ప్రారంభించారు. నడుముకు బెల్ట్ ధరించి జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోను రకుల్ షేర్ చేశారు. వైద్యుల సలహా మేరకు సేఫ్టీ గేర్‌తో మళ్లీ వర్కౌట్స్ మొదలుపెట్టినట్లు ఆమె వెల్లడించినట్లు సమాచారం.

# పారిశ్రామిక విప్లవంలాగే ఏఐ..

## ఆలోచించే ఉద్యోగాలను తినేస్తుంది: ఆర్జీవీ



విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో మానవ మేధస్సుకు, సృజనాత్మకతకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. ఒకప్పుడు పారిశ్రామిక విప్లవం శారీరక శ్రమతో కూడిన ఉద్యోగాలను ఎలా అయితే తుడిచిపెట్టిందో, ఇప్పుడు ఏఐ ఆలోచనతో కూడిన ఉద్యోగాలను కనుమరుగు చేస్తుందని జోస్యం చెప్పారు.ఈ అంశంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో వర్మ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ఏఐని వెంటనే అందిపుచ్చుకోని వారి ఉద్యోగాలే ముందుగా కనుమరుగవుతాయి. సాంకేతికత ఎప్పుడూ మన సౌలభ్యం కోసమే రూపొందింది. శారీరక శ్రమ, సమయం వృథా చేసే పనుల నుంచి మనల్ని కాపాడటానికే అది ఉంది. మనం ఎప్పుడూ స్వేచ్ఛా సమయం కోరుకుంటాం. ఇప్పుడు ఏఐ మనకు ఆ స్వేచ్ఛను శాశ్వతంగా ఇచ్చేస్తోంది. మానవులుగా మనకు రెండు ఆస్తులు ఉన్నాయి.. ఒకటి కండబలం, మరొకటి ఆలోచించే మెదడు. పారిశ్రామిక విప్లవం కండబలాన్ని తుడిచిపెడితే, ఇప్పుడు ఏఐ మన మెదళ్లను తుడిచిపెడుతోంది. 'కోరుకున్నది నిజమైతే ప్రమాదం' అని చెప్పినట్లుగా ఇది జరుగుతోంది" అని వర్మ తన పోస్టులో విశ్లేషించారు. ఇలా ఏఐపై తన అభిప్రాయాలను పంచుకున్న వర్మ, ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. మనోజ్ బాజ్‌పేయ్, జెనీలియా దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రల్లో 'పోలీస్ స్టేషన్ మే భూత్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీనితో పాటు 'పోలీస్ కంపెనీ' అనే మరో ఆసక్తికర ప్రాజెక్టును కూడా రూపొందిస్తున్నారు. ఇందులో హర్షవర్ధన్ రాణే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. 'ఇది డి కంపెనీ కన్నా ప్రమాదకరం' అనేది 'పోలీస్ కంపెనీ' సినిమా ట్యాగ్‌లైన్. అదనపు అధికారాలు చేతికి వచ్చినప్పుడు ఒక పోలీస్ వ్యవస్థ ఎలా ఒక కంపెనీగా మారుతుందనే కథాంశంతో ఈ సినిమా ఉంటుందని వర్మ గతంలోనే వెల్లడించారు. దావూద్ ఇబ్రహీం, చోటా రాజన్‌ల మధ్య విభేదాలు తలెత్తిన తర్వాత ముంబై అండర్‌వరల్డ్‌లో ఏర్పడిన శూన్యత నేపథ్యంలో ఈ కథ సాగుతుందని తెలిపారు. ఇందులో హర్షవర్ధన్ రాణే.. దయా నాయక్ పాత్ర స్ఫూర్తితో రూపొందించిన క్యారెక్టర్‌లో నటిస్తున్నట్లు సమాచారం.

## వినాయక చవితి ప్రెస్ మీట్ డిఎస్పి ఎన్ ఎస్ మూర్తి




**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు డిఎస్పిఎన్ఎస్ మూర్తి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఈనెల 14వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించే వినాయక చవితి ఏర్పాట్లకు ప్రతి ఒక్కరు సంసిద్ధమవుతున్నార,నివినాయక చవితి ఉత్సవాల గణేష్ మండపాల ఏర్పాటుకు ఆన్లైన్లో మండపాల అనుమతి కోసం మీరు ఏపీ గణేష్ ఉత్సవ పోర్టల్ వెబ్సైట్ను ఉచితంగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు,రానున్న లోకల్ బాడీ ఎలక్షన్లు ప్రక్రియ పరారంభమవడంతో ప్రతి చోట్ల పోలీసులు అప్రమత్తంగా ఉన్నామని ఎక్కడ ఎటువంటి రాజకీయ గొడవలు గాని ఇతరత్రా గొడవలు జరగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు తగు జాగ్రత్త తీసుకోవాలని తెలియజేశారు, నిమజ్జనం చేసే రూట్ మ్యాప్ ను పోలీసులు ముందుగానే తెలియజేస్తే తగ్గుతమైన బందోబస్తు కల్పిస్తామన్నారు, వినాయక చవితి నందు డీజెలకు పూర్తిగా అనుమతి ఇవ్వటం లేదని డీజేలు పెడితే వారిపై తమ విధమైన చర్యలు తీసుకుంటామన్నారు, ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో మట్టి గణపతిని పూజించి వినాయక చవితి ప్రశాంతపు వాతావరణం లో నిర్వహించుకోవాలని తెలియజేశారు,వినాయక చవితి కమిటీ సభ్యులు వారికి సంబంధించిన వివరాలను పోలీస్ స్టేషన్లో తెలియజేస్తే వారికి కావలసిన బందోబస్తుతో పాటు తగ విధమైన భద్రతా సౌకర్యం కల్పిస్తామని తద్వారా ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో వినాయక చవితి చేసుకోవచ్చని ఈ సందర్భంగా వినాయక చవితి కమిటీ సభ్యులకు తెలియజేశారు.

## ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలపై
# ఆకస్మిక తనిఖీలు: కలెక్టర్ ఆలా



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న బోయిన్ పల్లి లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో ఆమె మాట్లాడి ప్రాథమిక కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక కేంద్రంలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి వచ్చే రోగులకు వైద్య కేంద్రంలో ఏఎన్ఎం లు,వైద్యులు అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని ఆలా అన్నారు. వైద్య సేవలు వైద్య పరీక్షలతో పాటు రోగులకు ఇచ్చే ఔషధాలు (మాత్రలు) అందుబాటులో ఉన్నాయా లేవా అంటూ పరిశీలించారు. వైద్యులు సకాలంలో కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. మందుల కొరత లేకుండా రోగులకు మందులను అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో జూనియర్ కాలేజీకి సంబంధించి స్థల సేకరణ చేసి త్వరితగతిన నిర్మాణం చేపడుతామని ప్రియాంక ఈ సందర్భంగా తెలిపారు.

## వెయ్యి రోజుల ప్రజా పాలనలో
# సర్కార్ ఫెయిల్యూర్:క్రిశాంక్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** వెయ్యి రోజులు కాంగ్రెస్ పాలన అభిమానం అయిన నేపథ్యంలో బిఆర్ఎస్ పిలుపుమేరకు కంటోన్మెంట్ బిఆర్ఎస్ నాయకుడు, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె కృషాంక్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ సీఈవో అరవింద్ కుమార్ ద్వివేదికి కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కంటోన్మెంట్ ప్రజావాణి కార్యక్రమం లేకపోవడంతో పాటు ఎన్నికలు కూడా జరిగే ఆరు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కృషాంక్ అన్నారు. రహదారులు గుంతలుగా మారడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మౌలిక వసతుల లేమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బి ఆర్ ఎస్ నాయకులపై నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీ గణేష్ పాత్ర ఏముందని ప్రశ్నించారు. కెసిఆర్ కు రాజీనామాలు కొత్త కావని,వెయ్యి రోజుల రేవంత్ రెడ్డి పాలన విఫలం చెందిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### - మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి..

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు నిన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ప్రాంగణంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల దరిద్రపు పాలనకు ఏడు రోజులు నిరసన కార్యక్రమంలో భాగంగా నిన్న ఆరో రోజు సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఇఓకి వినతి పత్రం అందజేశారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బోర్డు పరిధిలో ఉన్న ఎనిమిది వార్డుల్లో,జిహెచ్ఎంసి లో సైతం పరిపాలనతో విసిగిపోయిన ప్రజలు,గత కొంత కాలంగా అధికారులకు లిఖిత పూర్వకంగా లేఖలు అందజేసినప్పటికి ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉంది పరిస్థితి. ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు పరిపాలనందించదు, కూలిపోయే రోజులు దగ్గర పడ్డాయని జెయంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జెల నాగేష్, సాయన్న నివేదిత, బోర్డు మాజీ సభ్యులు శ్యాం కుమార్,అనిత ప్రభాకర్, నళిని కిరణ్,పాండు యాదవ్,లోక్ నాథ్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, కె.బి.శంకర్,భాస్కర్, గంగారాం,సంతోష్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ఏపీఓగా దామోదరస్వామి బాధ్యతల స్వీకరణ

**- పదోన్నతిపై వచ్చిన ఏపీఓకు ఘన స్వాగతం**



ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్)పదోన్నతిపై అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీఓ) గా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయానికి వచ్చిన టీవీఆర్ దామోదరస్వామికి ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. ఐటీడీఏ కార్యాలయ రెగ్యులర్ ఉద్యోగులు ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ఏ.వెంకటేశ్వర్లు, టీ.వీరాస్వామి, పి.శ్రీనివాస్, డీటీడీవో కిరణ్ కృష్ణారావు, కంప్యూటర్ ఆపరేటర్ జి.హేమన్ తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క సహకారంతో
# నెరవేరిన సొంతింటి కల

**- తుపాకులగూడెంలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం**



**ములుగు(ప్రశ్న న్యూస్)** కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామానికి చెందిన ఆలం రాధిక, లక్ష్మినారాయణ దంపతుల సొంత ఇంటి కల మంత్రి సీతక్క సహకారంతో నెరవేరింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన నూతన గృహ గృహప్రవేశ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాడి రాంబాబు హాజరై రిబ్బన్ కటింగ్ చేసి నూతన గృహంలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం లబ్ధిదారు ఆలం రాధిక మాట్లాడుతూ మంత్రి సీతక్క సహకారంతో తమ సొంత ఇంటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచిన మంత్రి సీతక్క జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుపాకులగూడెం సర్పంచ్ పీర్ల స్వప్న-ప్రేమ్ కుమార్, లక్ష్మీపురం సర్పంచ్ రోజా-వెంకటేష్, మండల యూత్ అధ్యక్షుడు బోట నాగేష్, యూత్ ఉపాధ్యక్షుడు కుమ్మరి వెంకట్, వార్డు మెంబర్ కుమ్మరి కుమార్, మండల నాయకులు పాలకుర్తి శ్రీధర్, పురుషోత్తం, ఆలం కుమార్, జాడి హరీష్, ఆలం స్వామి, యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ గంజాయి అవగాహన ర్యాలీ




**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై డ్రగ్స్, గంజాయి,మహిళలపై నేరాలు,సైబర్ క్రైమ్కు వ్యతిరేకంగా భారీ అవగాహన ర్యాలీని ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి సహాయ కార్యదర్శి కోగిలి ముని చందు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ కాళహస్తి డిఎస్పి ఎన్ఎస్ మూర్తి మరియు పోలీసు శాఖ పాల్గొని విద్యార్థినీ విద్యార్థులతో మత్తు పదార్థాలపై మరియుఅవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి సహాయ కార్యదర్శి కోగిలి ముని చందు నాయకుడు మాట్లాడుతూ. యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని తద్వారా వారి భవిష్యత్తు కోల్పోతున్నారని ఇకనైనా యువత మత్తు పదార్థాలకు దూరమై వారి భవిష్యత్తును కాపాడుకోవాలని తెలియజేశారు,మహిళా రక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని నేడు దేశంలో మహిళల రక్షణకు అనేక రకాలైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటిని రక్షించే విధంగా పోలీస్ వ్యవస్థ మరియు యువత ముందుకు వచ్చి మహిళా రక్షణకై మహిళా సాధికారతకై కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే సునీత రెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని,
## అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే చీర లాగారంటూ..?

**అంటూ ఆగ్రహించిన మండల బీఆర్ఎస్ శ్రేణులు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) సోమవారం మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకోప్ దిగారు. మండల పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్త ఆధ్వర్యంలో రాస్తారోకోకు దిగిన ఆ పార్టీకిచెందిననాయకులుప్రభుత్వానికి,పోలీసులకు, సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడి నుండి ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. ఎమ్మెల్యే సునీత రెడ్డి,ఇతర ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును నిరసిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి హాయంలో మహిళలకు రక్షణ కరువైందని,మహిళల పట్ల పోలీసుల అనుచిత వైఖరిని నిరసిస్తూ సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యే పై జరిగిన ఘటనపై సీఎం బాధ్యత వహిస్తూ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిన్న కొండా సురేఖ రెడ్డిని భర్తరఫ్ చేశారు. నేడు ఈరోజు ఎమ్మెల్యే సునీత రెడ్డి చీర లాగారంటూ పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు సంతోష్ రావు,డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్ కొల్చారం మండల సర్పంచులు దొడ్ల ఆంజనేయులు ,నిర్మల,స్వామి,మోహన్,వినోద్ నాయక్, యోహాన్,మాజీ జడ్పీటీసీలు సంతోష్ కుమార్,శ్రీనివాస్ రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ నరేందర్ రెడ్డి,మైనార్టీ నాయకుడు ఖదీర్,వేమారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయిబాలాజీ హోమ్స్ పేస్ II
# నూతన కార్యవర్గం ఎన్నిక




బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసీ పరిధిలోని బడంగ్ పేట్ సర్కిల్లో ఉన్న శ్రీసాయిబాలాజీ హోమ్స్ పేస్ శ్రీశ్రీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో రాందాస్ నాయక్ ప్యానల్ ఘనవిజయం సాధించింది. గత ఆదివారం నాడు జరిగిన ఎన్నికల్లో రాందాస్ నాయక్, చంద్రపాల్ రెడ్డి ప్యానెల్స్ మద్య హోరాహోరీగా జరిగిన పోరులో 416 ఓట్లు పోలవగా రాందాస్ నాయక్ ప్యానెల్ 275 ఓట్లు, చంద్రపాల్ రెడ్డి ప్యానల్ 140 ఓట్లు సాధించగా ఒకటి చెల్లని ఓటు పోలైనట్లు సమాచారం. దీంతో 135 ఓట్ల తేడాతో చంద్రపాల్ రెడ్డి ప్యానెల్ పై రాందాస్ నాయక్ ప్యానెల్ ఘనవిజయం సాధించినట్లు ఎన్నికల కమిటి ప్రకటించింది. ఈ సందర్భంగా రాందాస్ నాయక్ మాట్లాడుతు తమ ప్యానెల్ పట్ల కాలనీవాసులు చూపిన ఆదరణ, నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతు కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్స్, రోడ్లపై చెత్త వేయడం, రోడ్లు స్వీపింగ్ లేకపోవడం, రోడ్ల వెంబడి ఏపుగా పెరిగిన చెట్ల రెమ్మలను తొలగించడం వంటి అనేక సమస్యల పరిష్కారానికి కాలనీవాసుల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన శ్రీ రామచంద్ర మూర్తి మాట్లాడుతు తమ ప్యానెల్ కు అవకాశం కల్పించిన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలుపుతు కాలనీవాసుల సహకారంతో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతు ఎల్లవేళలా అందుబాటులో ఉంటు కాలనీ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యుల వివరాలను తెలుపుతు అధ్యక్షునిగా రాందాస్ నాయక్, ఉపాధ్యక్షులుగా శ్రీరామచంద్ర మూర్తి, భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వి. క్రిష్ణ, కోషాధికారిగా జి. రామనాగిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి. సాయి కిషోర్, జాయింట్ సెక్రటరీగా బి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా నాసిగారి రాజేష్, పి మనోహర్, పి. చంద్ర ప్రకాష్, యు. మహేష్ గౌడ్ లు ఎన్నికైనట్లు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రంలో 1000 రోజుల ప్రజా పాలన పూర్తి చేసిన సందర్భంగా విజయోత్సవ వికాస్ యాత్రలో పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) పిలుపు మేరకు నర్సాపూర్ నియోజకవర్గ రాష్ట్ర లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవ వికాస యాత్ర ఘనంగా నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రాజి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి ముందుగా పట్టణంలోని శ్రీ మల్లన గుడి వద్ద నుండి ప్రారంభమై నర్సాపూర్ చౌరస్తా వరకు ఈ వికాస యాత్ర నిర్వహించి కాంగ్రెస్ పార్టీ జెండాలతో విజయోత్సాహాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమే ఈ 1000 రోజుల పాలన అని అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకుని పారదర్శకమైన, ప్రజా అనుకూలమైన పాలన అందిస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతులకు రైతు భరోసా, పంట రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు మరియు యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే అమలులో ఉన్నాయని వివరించారు. ప్రజలపై ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అనేక రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టిందని, రైతాంగం, మహిళలు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు, యువత అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్ల పాటు మంత్రిగా పని చేసిన సునీతా రెడ్డి హయాంలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందన్నారు. వెయ్యి రోజుల పాలనపై భారాస నిర సన కార్యక్రమాలు చేపట్టడం సరికాదనిన్నారు. కేసీఆర్ను అసెంబ్లీకి తీసుకు రావడానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి కృషి చేయాలన్నారు. కాలేశ్వరం కట్టామని గొప్పలు చెబుతున్న సెల్ఫి రావు మాజీ మంత్రి హరీష్ రావు దమ్ముంటే నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ను సాగు చేసి చూపించాలని అన్నారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్,మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు,మహిళా కాంగ్రెస్,యువజన కాంగ్రెస్ నాయకులు,అనుబంధ సంస్థల నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో 2000 మంది ఆడపడుచులకు సామూహిక శ్రీమంతం

**హైదరాబాద్** అంగరంగ వైభవంగా జరిగిన సామూహిక శ్రీమంతం అన్న అనే మాటను సార్థకం చేసుకుని..పుట్టింటి కానుకగా చీర-సారె, పసుపు, కుంకుమ అందజేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..పోషకాహార వారోత్సవంలో భాగంగా నవయువ నిర్మాణ్ సంస్థ మరియు కాంగ్రెస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్గూడ మహమ్మద్ ఫంక్షన్ హాల్లో సామూహిక శ్రీమంతాలు,అన్నప్రాసన కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 2,000 మంది గర్భిణీలు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరై సందడి చేశారు..కాబోయే తల్లులకు ఆరోగ్యం, ఆనందం, ఆయురారోగ్యాలతో నిండిన జీవితం కలగాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు పుట్టింటి కానుకగా చీర-సారెతో పాటు పసుపు, కుంకుమ అందజేసి సామూహికంగా శ్రీమంతం చేశారు. అన్నగా అండగా నిలిచి.. ఆడపడుచుల పట్ల తనకున్న ఆప్యాయతను చాటుకుంటూ, పేద కుటుంబాలకు చెందిన మహిళలకు అండగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు..అదేవిధంగా చిన్నారి తొలిసారిగా అన్నం రుచి చూసే మధురమైన, చిరస్మరణీయమైన అన్నప్రాసన కార్యక్రమాన్ని గద్వాల్ విజయలక్ష్మి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేశ్రీ వి. నవీన్ యాదవ్ రు కలిసి నిర్వహించి చిన్నారులకు ఆశీస్సులు అందించారు..ఈ కార్యక్రమనికి ఎఖఅఅ అధ్యక్షులు, మహేష్ కుమార్ మంత్రులు,దుద్దిల్లా శ్రీధర్ బాబు, సీతక్క, అజ్జరుద్దీన్ను, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు గద్వాల విజయలక్ష్మి గారు,మైనార్టీ నాయకులు ఫాహీం ఖురేషి ..ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాజీ ఎంపీ మధుయాష్ గౌడ్ , ఓఒఅ అద్దంకి దయాకర్ .. ఎమ్మెల్యేలు, దానం నాగేందర్ , మరియు ఉత్తమ్ పద్మావతి రెడ్డి ,చిత్తం పర్ణిక రెడ్డి , యశస్విని రెడ్డి , టీజీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ సామ రామ్మోహన్ రెడ్డి , గద్దర్ వెన్నెలరు, కాల్వ సుజాత , కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి , దీపక్దీపక్ జాన్ ,సరిత తిరుపతయ్య , చిత్రపురి కాలనీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ,తదితరులు, హాజరయ్యారు..

# గణేష్ ఆగమన్ పేరుతో..
# ప్రజలు ఆగమాగం

## ఊరేగింపులతో ట్రాఫిక్ జామ్‌లు.. రోడ్లపై నరకం

- బ్యాండ్ బాజాలతో భక్తి రాదు.. ప్రజల చెవులు పగలగొట్టడం తప్పా.?
- మండపాల పేరుతో గల్లీలు బంద్.. అంబులెన్సులకూ దారేది.?
- భక్తి పేరుతో ప్రజలకు ప్రత్యక్ష నరకయాతనా.?
- భక్తా.. బల ప్రదర్శనా.? ఆగమన్‌లో విచ్చలవిడి ఖర్చులెందుకు.?
- డీజే నిషేధం అంటే పేరు మార్చి ప్యాడ్ బ్యాండ్ సౌండ్ లతో హంగామా
- పండుగ భక్తితో జరగాలి, కానీ డిస్కో లైట్లు, భారీ సౌండ్ లతో కాదు
- చిన్నారులు, వృద్ధులు, రోగులకు శబ్ద కాలుష్య శిక్ష
- గణేశ్ ఉత్సవాలా.. గల్లీల్లో గందరగోళమా.?
- పోలీసులు కఠినంగా వ్యవహరించకపోతే 'భక్తి' పేరుతో బీభత్సమే
- హైదరాబాద్‌లో గణేశ్ ఆగమన్, నిమజ్జనం పేరుతో రహదారులపై హంగామా..
- ట్రాఫిక్ కష్టాలు, శబ్ద కాలుష్యంపై ప్రజల ఆగ్రహం






**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** భక్తి అంటే పూజలు.. భక్తి అంటే అన్నదానం.. భక్తి అంటే ఆధ్యాత్మిక చింతన.. భక్తి అంటే హిందూ ధర్మం, సంస్కృతి అభివృద్ధికి తోడ్పడటం. కానీ ప్రస్తుతం కొందరి నిర్వాహకుల తీరు చూస్తుంటే భక్తి పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా మారిందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఆగమన్, నిమజ్జనం పేరుతో భారీ బ్యాండ్లు, ప్యాడ్ బ్యాండ్లు, డీజే తరహా శబ్దాలతో పాటు కళ్ళు పోయేలా ఎల్ఈడి ఫోక్సింగ్ లైట్లు నగరవాసుల సహనానికి పరీక్ష పెడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గల్లీ నుంచి ప్రధాన రహదారి వరకు ఇష్టారాజ్యంగా మండపాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆటోలు వెళ్లడానికి కూడా ఇబ్బంది ఏర్పడుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ ఎలా వెళ్లాలి.? అన్న ప్రశ్న తలెత్తుతోంది. మండపాల ఏర్పాటు సమయంలో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ గల్లీ నాయకుల కొంతమంది ప్రజాప్రతినిధుల వత్తిడితో నిబంధనలను గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనితో అనుమతుల విషయంలో నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### డీజేకు పేరు మార్చితే శబ్దం తగ్గుతుందా.?

డీజేలకు అనుమతి లేదనే నిబంధనలను తప్పించుకునేందుకు కొందరు నిర్వాహకులు 'ప్యాడ్ బ్యాండ్' పేరుతో భారీ సౌండ్ సిస్టమ్స్ ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెవులు పగిలేంత శబ్దంతో గంటల తరబడి సౌండ్ పెట్టడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. శబ్ద కాలుష్య నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు, పోలీసులు ఇలాంటి వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాల్సిన




అవసరం చాలా ఉంది.

### రంగురంగుల లైట్లతోనూ ఇబ్బందులే

భక్తి పేరుతో భారీగా రంగురంగుల లైట్లు ఏర్పాటు చేయడం కూడా కొన్ని ప్రాంతాల్లో వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. దానితోపాటు ఎల్ఈడి ఫోక్సింగ్ లైట్లు ఏర్పాటు చేయడంతో కళ్ళ పైన భరించలేని వెలుతురు పడడంతో కళ్ళు ఒక్క సారిగా చీకటిగా మారుతూ దృష్టి దోషాలు ఏర్పడుతున్నాయి. కళ్లకు ఇబ్బంది కలిగించే విధంగా లైట్లను రోడ్ల వైపు తిప్పడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### భక్తా.. బల ప్రదర్శనా.?

గణేశ్ ఆగమన్, నిమజ్జనం కార్యక్రమాల పేరుతో భారీగా డబ్బు ఖర్చు చేయడం, భారీ బ్యాండ్లు, భారీ లైట్లు, భారీ ఊరేగింపులు నిర్వహించడం భక్తి ప్రదర్శనా.? లేక ఆర్థిక, బల ప్రదర్శనా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల ఆగమన్, నిమజ్జనం సందర్భంగా కొందరు మద్యం సేవించి చిందులు వేస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇది భక్తి పేరుకు ఎంతవరకు న్యాయం చేస్తుందో నిర్వాహకులే ఆలోచించాలి. మరి ఇంత డబ్బు ఎక్కడి నుండి వస్తుంది.? అన్నదానిపై కూడా అధికారులు దృష్టి పెట్టవలసిన అవసరం చాలా ఉంది.

### భక్తి అంటే నలుగురికీ మంచిని చేయాలి

తన భక్తితో పాటు నలుగురికీ మంచి కలిగేలా పండుగ జరుపుకోవడం సంప్రదాయం. కానీ ప్రస్తుతం కొందరి తీరు కారణంగా భక్తి పేరుతో నలుగురినీ అనేక ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడుతున్నాయి. పండుగ జరుపుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. అయితే ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, అత్యవసర వాహనాలకు దారి ఉండేలా, శబ్ద కాలుష్యం లేకుండా ఉత్సవాలు నిర్వహించడమే నిజమైన బాధ్యతాయుతమైన భక్తి అన్న విషయం నిర్వాహకులు మర్చిపోకూడదు.

### ప్రభుత్వం, పోలీసులు కఠినంగా
## వ్యవహరించక తప్పదు

ప్రభుత్వం, పోలీసులు ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలి. లేకపోతే ప్రతి సంవత్సరం ఆగమన్, నిమజ్జనం పేరుతో ఇదే గందరగోళం పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. భక్తి పేరుతో ప్రజల సహనాన్ని పరీక్షించే పరిస్థితులకు ఇప్పటికైనా చెక్ పెట్టాల్సిన సమయం వచ్చింది.

### మోదీ సభ కోసం తొలిసారి
## 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్
### - 30 నిమిషాల్లోనే సీట్లన్నీ ఫుల్




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 8న గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న కార్యక్రమానికి ప్రజల నుంచి ముందుగానే విశేష స్పందన వచ్చింది. తొలిసారిగా ప్రధాని కార్యక్రమానికి 'బుక్ మైషో' ద్వారా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆ తర్వాత కూడా భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ఈ సీట్ల బుకింగ్ తీరు మోదీ కార్యక్రమం పట్ల ప్రజలకు ఉన్న అపారమైన ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ నేడు వడోదరలో పర్యటించనున్నారు. నగరంలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ ప్రోగ్రామ్ సీట్ల రిజిస్ట్రేషన్ కోసం తొలిసారి వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) బుక్ మైషోను ఉపయోగించింది. దీంతో ప్రధాని సభకు భారీగా స్పందన రావడం గమనార్హం.

## వారం రోజుల పాటు
## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
### - బీఏసీ సమావేశంలో నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను వారం రోజుల పాటు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం రోజున ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీజేపీ ఎమ్మెల్యే సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం సభ్యులు అహ్మద్ బిన్ బలాలా, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి?, ఏయే అంశాలపై చర్చించాలనే దానిపై చర్చించారు. ఈ క్రమంలోనే వారం పాటు తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలనుకుంటే మరోసారి బీఏసీ భేటీ కావాలని నిర్ణయించారు. ఈ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్, 22వ నిషేధిత జాబితాతో పాటు 25 అంశాలపై చర్చ చేపట్టాలని బీఏసీ సమావేశంలో బీజేపీ పట్టుబట్టింది. అయితే 22ఏ అంశంపై చర్చకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనా చర్చకు సిద్ధమని ప్రభుత్వం తెలిపింది. ఈ బీఏసీలో నిర్ణయం ప్రకారం అసెంబ్లీ సమావేశాలను ఈనెల 12 వరకు నిర్వహించనున్నారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి బీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. ఇదిలాఉంటే, తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు తొలి రోజు ముగిశాయి. తొలి రోజు సభలో పలు అంశాలపై చర్చకు బీజేపీ పట్టుబట్టింది. మరోవైపు అసెంబ్లీ వెలుపల ఎమ్మెల్సీ తాతా మధు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపింది.




# ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల 'ఫ్యాన్సీ పేర్ల' పై రచ్చ

### - నిబంధనలు ఉల్లంఘిస్తూ ఆకర్షణీయ పేర్లతో పేరెంట్స్ ను ఆకట్టుకుంటున్న స్కూళ్లు

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నాయి. ఇంటర్నేషనల్, వరల్డ్, టెక్నో, మోడల్, కాన్సెప్ట్, స్పేస్, ఐఐటీ, ఒలంపియాడ్ వంటి పేర్లను స్కూళ్లకు పెట్టొద్దని ప్రభుత్వం ఆదేశించినా, మేనేజ్మెంట్లు మాత్రం ఈ నియమాలను తోసిపుచ్చుతున్నాయి. ఫలితంగా విద్యాశాఖ అధికారులు నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహిస్తుండగా, కార్పొరేట్ సంస్థలు ఈ ఫ్యాన్సీ పేర్లను ఆయుధంగా మార్చుకుని తల్లిదండ్రుల నుంచి భారీ ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తున్నాయి.

### నిబంధనలు ఏమిటి.?

విద్యాహక్కు చట్టం, జీవో 91 ప్రకారం రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు తమ పేరు పక్కన కేవలం 'ప్రైవేట్ స్కూల్' అని మాత్రమే పేర్కొనాలి. ఆకర్షణ కోసం ఇతర పదాలను వాడకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. బోర్డులు, బస్సులు, గోడలు, ప్రకటనలపై ఈ ఫ్యాన్సీ పేర్లు కనిపిస్తున్నా.. రికార్డుల్లో మాత్రం 'ప్రైవేట్ స్కూల్'గానే నమోదు చేసుకుంటున్నాయి.

### పరిస్థితి ఏమిటి.?

రాష్ట్రంలో 13,000కు పైగా ప్రైవేట్ స్కూళ్లుండగా, వాటిలో దాదాపు మూడోవంతు పాఠశాలలు నిబంధనలను ఉల్లంఘిస్తూనే ఫ్యాన్సీ పేర్లను కొనసాగిస్తున్నాయి. గతంలో అధికారులు కొన్ని స్కూళ్ల బోర్డులపై నలుపు రంగు పూయించి, ఆ పేర్లను తొలగించినా, మళ్లీ కొన్నేండ్లుగా అవే పేర్లతో ప్రదర్శిస్తున్నారు.



### తల్లిదండ్రుల్లో భ్రమ

'ఇంటర్నేషనల్', 'వరల్డ్' లాంటి పేర్లు పెట్టడం ద్వారా ఏదో ప్రత్యేక విద్యా బోధన ఉంటుందనే భ్రమను సృష్టిస్తున్నాయి. ఈ పేర్లు సర్టిఫికెట్లపై ఉండవని, ఇవి కేవలం ఆకర్షణ కోసం మాత్రమేనని చాలా మంది తల్లిదండ్రులకు తెలియదు.

### అధికారుల వైఖరిపై ఆరోపణలు

జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు సరైన తనిఖీలు నిర్వహించడం లేదని, ఉన్నా కూడా పేర్ల విషయంలో సీరియస్గా తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బోర్డులు ఉన్న స్కూళ్లకు నోటీసులు ఇవ్వడానికి కూడా అధికారులు ముందుకు రావడం లేదు.

### డిమాండ్ ఏమిటి.?

నిబంధనలను ఉల్లంఘిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, అనధికార బోర్డులను తొలగించాలని, అలాగే ఫీజుల వసూళ్లపై నియంత్రణ తీసుకురావాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588